teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 74 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 19 ఆగస్టు 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## ప్రధానిని కలిసిన వ్యోమగామి శుభాన్షు శుక్లా

త్రివర్ణ పతాకాన్ని భూమి చిత్రాలను బహూకరించిన శుక్లా

మిషన్ అనుభవాలను పంచుకున్న శుభాన్షు

శుభాన్షు శుక్లాను ప్రశంసించిన పార్లమెంటు



05



## కాంట్రాక్టర్ల ధర్నాపై స్పందించిన హరీష్ రావు

రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజన్ లేదు

కేవలం కమీషన్ల మీదే ఫోకస్ అంటూ ఆరోపణలు

కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి హరీష్ రావు విమర్శలు

.. వివరాలు 2లో



## మోడీ - పుతిన్ ఫోన్ సంభాషణ

ట్రంప్‌తో భేటీ వివరాలను ప్రధానికి వివరించిన పుతిన్

ఉక్రెయిన్ వివాదంపై పుతిన్‌తో మోడీ చర్చ

మోడీకి కృతజ్ఞతలు తెలిపిన పుతిన్

ఈ నెల 15న అలాస్కాలో ట్రంప్‌తో పుతిన్ సమావేశం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 18 (తీన్మార్ న్యూస్): రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాని నరేంద్ర మోడీతో సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంపుతో ఇటీవల అలస్కాలో జరిగిన భేటీ వివరాలను పుతిన్ మోడీకి

మిగతా 2 లో



# రాష్ట్రానికి వాన ముప్పు


## రాగల 24 గంటల్లో భారీ వర్షాలు

వాయుగుండంగా మారనున్న అల్పపీడనం

రెడ్ అలర్ట్ పేరుతో వార్నింగ్ బెల్స్

జిల్లాల్లో అప్రమత్తం చేసిన అధికారులు

తాజాగా తెలంగాణకు హెచ్చరిక జారీ చేసిన వాతావరణ శాఖ. 24 గంటల పాటు తెలంగాణలో భారీ వర్షాలు కుదిపెయ్యనున్నాయి. కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ పేరుతో వార్నింగ్ బెల్స్ మోగించింది వాతావరణ శాఖ. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాలను అప్రమత్తం చేశారు అధికారులు.



02

## 5% జీఎస్టీతో సంక్షోభంలో చేనేత రంగం

చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రద్దుకు డిమాండ్

కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

చేనేత కళా వారసత్వాన్ని కాపాడాలని విజ్ఞప్తి



హైదరాబాద్, ఆగష్టు 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర హస్తకళల పరిశ్రమకు ఊపిరిలాంటి చేనేత రంగం, చేనేత ఉత్పత్తులపై కేంద్రం విధించిన 5 శాతం జీఎస్టీతో ప్రస్తుతం చేనేత రంగం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే ఈ రంగం, గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులకు జీవనాధారం అవుతోందని తెలిపారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్

మిగతా 2 లో

## అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం

ఈ మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టిన ప్రభుత్వం

తరగతులను ప్రారంభించాలని ఆదేశించిన మంత్రి సీతక్క

హైదరాబాద్, ఆగష్టు 18 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాలతో అధికారులు ఇప్పటికే రంగంలోకి దిగారు. ప్రస్తుతం అనేక అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే గదిలో నడుస్తున్నందున



మిగతా 2 లో



## ఇదొక చెత్త సర్కారు

### మురుగు నీరు, చెత్తకుప్పలతో హైదరాబాద్

కంపుకొడుతున్న ఇతర పట్టణాలు

అసంతృప్తి వ్యక్తం చేసిన కేటీఆర్

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలుతున్నాయని ఆరోపణ

రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయ్

పాలకులు ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లలో బిజీగా ఉన్నారని ట్వీట్

ఎక్స్ వేదికగా ఫోటోలను జోడిస్తూ పోస్ట్

హైదరాబాద్, ఆగష్టు 18 (తీన్మార్ న్యూస్): ఇదొక చెత్త సర్కారు అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా రోడ్లపై చెత్త పేరుకుపోయిన ఫోటోలను జోడిస్తూ ఆసక్తికర పోస్ట్ చేశారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ, ఆరోగ్య శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్తకుప్పలతో హైదరాబాద్ నగరం, రాష్ట్రంలోని ఇతర

మిగతా 2 లో

## దొంగ ఓట్లపై పోరాటానికి కలుద్దాం



బీసీలు రాజ్యాధికారంలో భాగం కావాలని పిలుపు

రాహుల్ గాంధీ పాదయాత్రలో పాల్గొననున్న సీఎం

మతం ముసుగులో బహుజనుల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని ఆరోపణ

హైదరాబాద్, ఆగష్టు 18 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోనూ దొంగ ఓట్ల ద్వారా ఓట్ల చోరీ చేసే కుట్ర చేస్తున్నారని, అందరం కలిసికట్టుగా వారి భరతం పడదామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఓటు

మిగతా 2 లో



## హైదరాబాద్‌ను సినిమా నిర్మాణ కేంద్రంగా మారుస్తాం

జాతీయ సినిమా అవార్డు గ్రహీతలతో సీఎం భేటీ

సినీ పరిశ్రమ సమస్యలపై సీఎంకు వినతి

అవార్డు గ్రహీతలకు సీఎం అభినందనలు, సన్మానం

భేటీలో పాల్గొన్న సినీ ప్రముఖులు

హైదరాబాద్, ఆగష్టు 18 (తీన్మార్ న్యూస్): భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్ నగరాన్ని నిలుపుతామని సీఎం. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సినిమా రంగానికి ప్రోత్సాహకానికి అవసరమైన చేయూతను అందిస్తామని

మిగతా 2 లో

## స్తంభించిన ఎయిర్‌టెల్ నెట్ వర్క్

దేశంలోని అనేక ప్రాంతాల్లో తలెత్తిన సాంకేతిక సమస్య

వేలాది యూజర్స్ సోషల్ మీడియాలో ఫైర్

30 నిముషాల్లో 3,600కు పైగా ఫిర్యాదులు




.. వివరాలు 2లో

## సబితా ఇంద్రారెడ్డికి మళ్లీ నోటీసులు



02

కోర్టు తీర్పును రద్దు చేయాలని సీబీఐ అప్పీలు

కౌంటర్ పిటిషన్ దాఖలుకు హైకోర్టు నోటీసులు

అంతరగంగమ్మ వద్ద అక్రమ మైనింగ్ కేసులో మలుపు

అప్పీలులో సబితా, కృపానందం పాత్రపై ఆరోపణలు




02

## కొమురవెల్లికి రైలు కనెక్టివిటీ

మల్లన్న భక్తులకు శుభవార్త.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన

కొమురవెల్లి హాల్ట్ స్టేషన్ పనులు 95% పూర్తి

త్వరలో అందుబాటులోకి రైలు కనెక్టివిటీ

## సెలబ్రెటీలపై సజ్జనార్ ఫైర్

డబ్బు కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్న సెలబ్రిటీలు

బెట్టింగ్ యాప్స్, మోసపూరిత కంపెనీలకు దూరంగా ఉండాలి

రజినీకాంత్‌ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచన

సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపు

ఎక్స్ వేదికగా సజ్జనార్ ఆసక్తికరమైన పోస్ట్



హైదరాబాద్, ఆగష్టు 18 (తీన్మార్ న్యూస్): ఎక్స్ వేదికగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. సెలబ్రేటీల తప్పుడు ప్రచారాలు, ప్రమోషన్లపై ఆయన స్పందిస్తూ సూపర్ స్టార్ రజనీ కాంత్ ను

మిగతా 2 లో

## శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విషాద ఘటనలో మరొకరు మృతి

దీంతో ఆరుకు చేరిన మృతుల సంఖ్య

రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం


త్వరలోనే చెక్‌లను పంపిణీ చేస్తామన్న మంత్రి శ్రీధర్‌బాబు



.. వివరాలు 2లో

# రాష్ట్రానికి వాన ముప్పు

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): తాజాగా తెలంగాణకు హెచ్చరిక జారీ చేసిన వాతావరణ శాఖ. 24 గంటల పాటు తెలంగాణలో భారీ వర్షాలు కుదిపెయ్యనున్నాయి. కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ పేరుతో వార్నింగ్ బెల్స్ మోగించింది వాతావరణ శాఖ. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాలను అప్రమత్తం చేశారు అధికారులు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం, రాగల 24 గంటల్లో వాయుగుండంగా మారనుందని %×వీణ% హెచ్చరించింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా మారి మంగళవారం (ఆగస్టు 19) మధ్యాహ్నానికి దక్షిణ ఒడిశా- ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని %×వీణ% చెబుతోంది. దీని ప్రభావంతో మూడు రోజుల పాటు వాన ముప్పు ఉంటుందని తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో సోమవారం నాడు.. తెలంగాణలోని పలు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కూడా ఏర్పడిందని వాతావరణ శాఖ పేర్కొంది. ముఖ్యంగా గద్వాల, మహబూబ్ నగర్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. వర్షాలకు తోడు భారీగా వరదలు వచ్చే అవకాశముందని హెచ్చరించింది. అయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. సోమవారం నాడు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఆయా జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఆ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదిలాబాద్, హన్మకొండ, కామారెడ్డి, ఖమ్మం, కొమురం భీమ్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, సూర్యాపేట, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.



# ఇదొక చెత్త సర్కారు



మొదటి పేజీ తరువాయి

పట్టణాలు కంపుకొడుతున్నాయని తెలిపారు. ఈ వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానాలు రోగులతో కిటకిటలాడుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో వర్షాకాలానికి 2 నెలల ముందు నుంచే సీజనల్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలపై మున్సిపల్ శాఖ, జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖలు సమీక్షా, సమన్వయ సమావేశాలు నిర్వహించి, ముందస్తు చర్యలు చేపట్టేవని గుర్తుకుచేశారు. కానీ ఇప్పుడా పరిస్థితులు కనిపించడం లేదన్నారు. ప్రజలు ఈసురోమని అలమటిస్తుంటే, పాలకులు మాత్రం ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లలో బిజీగా ఉన్నారని ట్వీట్‌లో రాసుకొచ్చారు.

# సబితా ఇంద్రారెడ్డికి మళ్లీ నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): ఓబుళాపురం మైనింగ్ కేసులో %ఊ8, ఊ%9 నిందితులుగా ఉన్న అప్పటి గనులశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందం లను నిర్దోషులుగా ప్రకటిస్తూ మే 6న హైదరాబాద్ సీబీఐ కోర్టు తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే. అయితే, ఆ తీర్పును రద్దు చేయాలని కోరుతూ సీబీఐ ఇటీవలే హైకోర్టులో అప్పీలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసింది. కేసులో నిందితులైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కృపానందంలకు శిక్ష విధించాలంటూ ఆ పిటిషన్‌లో వెల్లడించింది. అయితే, అనూహ్యంగా విచారణ నుంచి జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి తప్పుకున్నారు. నిందితుల్లో ఒకరి తరఫున గతంలో తాను వాదనలు వినిపించానని, అందువల్ల సీబీఐ అప్పీలుపై విచారణ చేపట్టలేని తెలిపారు. దీంతో తాజాగా మరో న్యాయమూర్తి సీబీఐ అప్పీల్‌పై సోమవారం విచారణ చేపట్టారు. సీబీఐ తరఫున శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపించగా హైకోర్టు సబితాఇంద్రారెడ్డితో పాటు కృపానందంను కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. కాగా, అంతరగంగమ్మ కొండల్లో ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి మైనింగ్ లీజులను కట్టబెట్టడానికి జరిగిన కుట్రలో కృపానందం, సబితల పాత్ర ఉందని అప్పీలులో సీబీఐ పేర్కొంది. అంతరగంగమ్మ కొండ వద్ద 68.5 హెక్టార్ల లీజులో వీరు కీలక పాత్ర పోషించి లీజులు మంజూరు చేయడంతో ఓఎంసీ అక్రమంగా 29.32 లక్షల టన్నుల ఖనిజాన్ని తరలించిందని తెలిపింది. లీజులకు సంబంధించి ఐబీఎం తో పాటు పర్యావరణ అనుమతులు పొందాలంటూ అప్పటి కార్యదర్శి కృపానందం 2005 నవంబరు 9న ఓఎంసీకి తాత్కాలిక లీజు మంజూరు చేశారని వెల్లడించారు. అందుకు మంత్రిగా సబితా ఇంద్రారెడ్డి కూడా ఆమోదం తెలిపారని అప్పీలులో పేర్కొన్నారు. నిందితులకు వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను సీబీఐ కోర్టు పట్టించుకోవడం లేదని సీబీఐ అధికారులు పేర్కొన్నారు. బి.వి.శ్రీనివాసరెడ్డి, గాలి జనార్దనరెడ్డితో పాటు కృపానందం, సబితా ఇంద్రారెడ్డిలపై ఐపీసీ 120 (బి) రెడ్‌విత్ 409, 13(2) రెడ్‌విత్ 13(1)(డి)ల అభియోగాలు రుజువు కాలేదని, నిర్దోషులుగా విడుదల చేసిన సీబీఐ కోర్టు తన ముందున్న రికార్డులను, ఆధారాలను పరిశీలించలేదని తెలిపారు. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రమణ్యం ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వారు నిర్దోషులని సీబీఐ కోర్టు ప్రకటించిందని అప్పీలులో పేర్కొన్నారు.

# స్తంభించిన ఎయిర్టెల్ నెట్ వర్క్




న్యూ ఢిల్లీ, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): దేశంలోని అనేక ప్రాంతాల్లో సోమవారం ఎయిర్టెల్ నెట్ వర్క్ స్తంభించి పోయింది. దేశంలోని పలు మెట్రో నగరాలు, పట్టణాల్లో నెట్వర్క్ డౌన్ అవడంతో వేలాది యూజర్స్ సోషల్ మీడియాలో ఫైర్ అవుతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ఈ సమస్య మొదలవగా 4:32 గంటల వరకు 3,600కు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాలతో పాటు గుజరాత్, చెన్నై, నాసిక్‌లలో కూడా సమస్యలు నమోదయ్యాయి. 74% ఫిర్యాదులు మొబైల్ కాల్స్ సమస్యలకు, 15% సిగ్నల్ లేకపోవడానికి, 11% మొబైల్ ఇంటర్నెట్‌కు సంబంధించినవిగా ఉన్నాయి. దీనిపై ఎయిర్టెల్ స్పందించింది. మా టీమ్ ఈ సమస్యను పరిష్కరించేందుకు పనిచేస్తోందని పేర్కొన్నారు. అతి త్వరలోనే సేవలను పునరుద్ధరిస్తామని, అసౌకర్యానికి క్షమించాలని ఓ ప్రకటన విడుదల చేసారు.

# దొంగ ఓట్లపై పోరాటానికి కలుద్దాం

మొదటి పేజీ తరువాయి



హక్కును దొంగిలించిన వారిని శిక్షించాలని రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తున్నారని త్వరలో నేను, డిప్యూటీ సీఎం ఆ పాదయాత్రలో పాల్గొని మద్దతు ఇస్తామన్నారు. సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలకు సీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ఆఫీస్ వద్ద పాపన్న గౌడ్ విగ్రహానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలు కూడా రాజ్యాధికారంలో భాగం కావాలని అన్నారు. విద్య ఒక్కటే తలరాతలు మారుస్తుందని, నాణ్యమైన చదువు ఇచ్చి, ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. కులగణనను తప్పుపడితే వందేళ్ల వరకు బహుజనులకు న్యాయం జరగదన్నారు. బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్న గౌడ్ నిరూపించారని పేర్కొన్నారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజులకు ఇచ్చాయన్నారు. కానీ తాము చరిత్ర స్ఫూర్తితో కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు చెప్పారు.

**బీసీలకు బీజేపీ అన్యాయం**

బీజేపీ బీసీలకు అన్యాయం చేస్తోందని సీఎం మండిపడ్డారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో ఆర్డినెన్స్‌లను ఆమోదించి కేంద్రానికి పంపామని, 5 నెలలైనా ఆమోదించకపోతే ధర్నా చేశామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ ఆ ధర్నాకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుంది కిషన్ రెడ్డి, మోడీ కాదా? అని ప్రశ్నించారు. మతం ముసుగులో బహుజనుల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని, రాహుల్ గాంధీపై కోపం ఉంటే ఆయనపై చూపాలని, కానీ ఆయన సిద్ధాంతాలపై చూపొద్దన్నారు.

# హైదరాబాద్‌ను సినిమా నిర్మాణ కేంద్రంగా మారుస్తాం : సీఎం



మొదటి పేజీ తరువాయి

తెలిపారు. 71 వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో వివిధ విభాగాల్లో ఎంపికైన సినీ ప్రముఖులు సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను సినీ ప్రముఖులు ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకొచ్చారు. హైదరాబాద్‌లో సినిమా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. అవార్డు గ్రహీతలైన భగవంత్ కేసరి సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి, హనుమాన్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, హనుమాన్ సినిమాకు విజువల్ ఎఫెక్ట్స్‌కు సంబంధించి వెంకట్, శ్రీనివాస్, టీమ్ సభ్యులు, ఫైట్ మాస్టర్స్ నందు, పృథ్వీ, బేబి సినిమా డైరెక్టర్ సాయి రాజేశ్, సింగర్ రోహిత్ ను ముఖ్యమంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ సినిమా నిర్మాతలు చైతన్య రెడ్డి, నిరంజన్ రెడ్డి, బేబి సినిమా నిర్మాత ఎస్కేఎన్, భగవంత్ కేసరి నిర్మాత గారపాటి సాహుతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

# సెలబ్రెటీలపై సజ్జనార్ ఫైర్

మొదటి పేజీ తరువాయి



ప్రశంసిస్తు మీరు రియల్ సూపర్ స్టార్ రజిని గారు అంటూ రాసుకొచ్చాడు. సజ్జనాత్ తన ట్వీట్‌లో కొందరు సెలబ్రెటీలు డబ్బు కోసం ఎలాంటి యాడ్స్ చేయడానికైనా వెనుకాడటం లేదు. కాసులకు కక్కుర్తి పడుతూ బెట్టింగ్ యాప్స్, మోసపూరిత గొలుసుకట్టు కంపెనీలతో పాటు సమాజానికి తీవ్రంగా హాని చేసే అనేక సంస్థలను ప్రమోట్ చేస్తున్నారు. ఎంతో మంది జీవితాలను చేజేతులా నాశనం చేస్తున్నారు. కానీ సూపర్ స్టార్ రజనీ కాంత్ 50 ఏళ్ల సినీ జీవితంలో ఎలాంటి వాణిజ్య ప్రకటనలు చేయకపోవడం గొప్ప విషయం. మిమ్మల్ని అభిమానించే వారిని మోసం చేయొద్దనే ఉద్దేశంతో మీరు తీసుకున్న ఈ నిర్ణయం నిజంగా అభినందనీయం. మాకు డబ్బే ముఖ్యం, సమాజం ఎటు పోయిన మాకేంటి అనుకునే ప్రస్తుత సెలబ్రిటీలు రజినీ కాంత్‌ని స్ఫూర్తిగా తీసుకోవాలి. బెట్టింగ్ యాప్స్, మోసపూరిత మల్టీ లెవల్ మార్కెటింగ్ కంపెనీలతో పాటు సమాజాన్ని చిద్రం చేసే సంస్థల ప్రమోషన్లకు దూరంగా ఉండాలి. సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి అని సజ్జనార్ రాసుకొచ్చారు.

# 5% జీఎస్టీతో సంక్షోభంలో చేనేత రంగం



మొదటి పేజీ తరువాయి

కాటన్, పట్టు చీరలు, నారాయణపేట కాటన్, పట్టు చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీస్, కరీంనగర్ డబుల్ క్లాత్ చెద్దర్లు, ఇతర చేనేత వస్త్రాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. అందులో ఆరు ఉత్పత్తులకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ కింద నమోదయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 23,046 మంది చేనేత కార్మికులు, 34,569 మంది అనుబంధ కార్మికులు ఈ రంగంలో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ముడి సరుకుల ధరలు పెరగడం, పవర్‌లూమ్, మిల్ రంగాలు తక్కువ ఉత్పత్తి వ్యయంతో వస్త్రాలు తయారు చేయడంతో, మార్కెట్లో చేనేత వస్త్రాలు తయారు చేసే నేత కార్మికులకు గిరాకీలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ దానికి తోడు 5 శాతం జీఎస్టీని విధించడంతో చేనేత ఉత్పత్తుల ధరలు పెరిగి వినియోగం తగ్గిపోతుందని, కార్మికుల జీవనాధారం సంక్షోభంలో పడుతోందని తెలిపారు. జీఎస్టీ కారణంగా నష్టపోతున్న నేతన్నలు తమ సంప్రదాయ వృత్తిని వదిలి వలస వెళ్లాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. ఖాదీ రంగం, చేనేత రంగం రెండూ సహజసిద్ధమైన గ్రామీణ పరిశ్రమలుగా ఒకే విధంగా ఉన్నప్పటికీ, ఖాదీ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపు ఉండగా, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీని కొనసాగించడం అన్యాయమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల సంఘాలు, కార్మికులు ఈ పన్నును వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే చేనేత కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు వారికి నిరంతరం ఉపాధి కల్పించేందుకు భారతీయ చేనేత కళా వారసత్వాన్ని భావితరాలకు అందించడానికి చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీని మినహాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర హస్తకళ, చేనేత శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు.

# అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

ప్రీ-ప్రైమరీ తరగతులు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా, జీరో ఎన్రోల్మెంట్ ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో 21 జిల్లాల్లో 61 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించారు. అందులో 34 పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలో ఉన్నందున అక్కడికి అంగన్‌వాడీ కేంద్రాలను మార్చి, పూర్వ ప్రాథమిక విద్యా తరగతులను ప్రారంభించాలని తాజాగా మంత్రి సీతక్క ఆదేశించారు. అనుగుణంగా మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ జీ. సృజన జిల్లా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. పాఠశాలల ప్రస్తుత పరిస్థితులను తక్షణమే పరిశీలించి, అనువుగా ఉంటే జిల్లా విద్యా అధికారులతో (డీఈఓ) సమన్వయం చేసి భవనాలను అంగన్‌వాడీ కేంద్రాల కోసం కేటాయించాలని ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 1 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసి పూర్వ ప్రాథమిక విద్యా బోధనను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశానికి ఆదర్శంగా తెలంగాణ అంగన్‌వాడీలు - సీతక్క ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ప్లే స్కూళ్లకు ఏమాత్రం తీసిపోకుండా అంగన్‌వాడీలు ఇప్పటికే పిల్లలకు నాణ్యమైన విద్య, సంరక్షణ అందిస్తున్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి, అంగన్‌వాడీల్లో ప్రీ-ప్రైమరీ సామర్థ్యాన్ని పెంపొందించి పిల్లలను ప్రాథమిక విద్యకు సిద్ధం చేస్తున్నాని తెలిపారు. చిన్నారి జీవితంలో ప్రారంభ దశలో ఇచ్చే సరైన సంరక్షణ, విద్య వారికి జీవితాంతం సానుకూల ఫలితాలు ఇస్తాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయని వెల్లడించారు. అందుకే పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీల ద్వారా అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాక, జీరో ఎన్రోల్మెంట్ పాఠశాలలను వినియోగించడం ద్వారా ఈ పథకాన్ని మరింత విస్తృతం చేసి, రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన ప్రారంభ విద్య అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు.

# కాంట్రాక్టర్ల ధర్నాపై స్పందించిన హరీష్ రావు

హైదరాబాద్, ఆగష్టు 18 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి తీవ్ర విమర్శలు చేసారు. తమ బిల్లులు వెంటనే విడుదల చేయాలనీ వందలాది కాంట్రాక్టర్లు సోమవారం సచివాలయంలోని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆర్థికశాఖ కమిషనర్ సందీప్ సుల్తానియా కార్యాలయాలను ముట్టడించిన ఘటనపై హరీష్ రావు స్పందించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజన్ లేదని కేవలం కమీషన్ల మీద మాత్రమే ఫోకస్ ఉందని ఆరోపించారు. గత రెండేళ్ల పాలనలో పెండింగ్ బిల్లుల కోసం రెండు సార్లు సచివాలయంలో కాంట్రాక్టర్లు ధర్నా చేసే స్థితి రావడం దేశంలో ఇదే మొదటిసారి కావచ్చునని అన్నారు. మొన్న కమీషన్లు ఇవ్వకపోతే బిల్లులు క్లియర్ చేయడం లేదని కాంట్రాక్టర్లు సచివాలయంలోని ఆర్థిక మంత్రి కార్యాలయాన్ని ముట్టడించారని, సోమవారం అదే సచివాలయం సెకండ్ ఫ్లోర్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ముందు కాంట్రాక్టర్ల మరోసారి మెరుపు ధర్నా చేశారని తెలిపారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వడంలో సీనియారిటీ పాటించకుండా, కమీషన్లు దండుకుంటున్నారు అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం ఉంటుందని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వమా? లేక స్కాంగ్రెస్ ప్రభుత్వమా? అని నిలదీశారు. ఒక మిషన్ లేదు, విజన్ లేదు, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నది ఒక్కటే టార్గెట్ కమీషన్లు మాత్రమేనని మండిపడ్డారు. ప్రభుత్వం తీరు ఇలాగే కొనసాగితే ప్రజలంతా ఏకమై ఎక్కడికక్కడ నిలదీస్తారని హరీష్ రావు హెచ్చరించారు.

# మోడీ - పుతిన్ ఫోన్ సంభాషణ

మొదటి పేజీ తరువాయి

వివరించారు. అనంతరం తన సమావేశం వివరాలను తెలియజేసినందుకు పుతిన్‌కు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్, రష్యాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపైనా చర్చించారు. నా స్నేహితుడు పుతిన్ ఫోన్ చేసి అలాస్కాలో ట్రంప్‌తో జరిగిన సమావేశంపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఉక్రెయిన్‌తో వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం భారత్ నిరంతరం పిలుపునిచ్చింది. ఈ విషయంలో అన్ని ప్రయత్నాలకు మద్దతిస్తుంది. రాబోయే రోజుల్లో మరిన్ని నిరంతర సంభాషణల కోసం ఎదురు చూస్తున్నా అని ఫోన్ కాల్ అనంతరం మోడీ ఎక్స్ లో పోస్ట్ చేశారు. కాగా, ఈ నెల15న అలాస్కాలో ట్రంప్‌తో పుతిన్ సమావేశమైన విషయం తెలిసిందే.

# శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విషాద ఘటనలో మరొకరు మృతి

హైదరాబాద్, ఆగష్టు 18 (తీన్మార్ న్యూస్): రామాంతపూర్ పరిధిలోని గోఖలే నగర్ శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఆదివారం అర్ధరాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. రథాన్ని లాగుతుండగా కరెంట్ షాక్ తగిలి ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తాజాగా మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య మొత్తం ఆరుకు చేరింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రామాంతపూర్ ప్రమాద మృతులకు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అందుకు సంబంధించి త్వరలోనే చెక్‌లను పంపిణీ చేస్తామని, గాయపడిన వారికి వైద్య ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఇవాళ ఆయన గాయపడిన వారిని పరామర్శించేందుకు గాంధీ ఆసుపత్రికి వెళ్లారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)



ములుగు జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, ప్రజల కోసం సమాజం కోసం ఉమ్మడి హక్కుల కోసం పోరాడిన సర్వాయి పాపన్న గౌడ్ లాంటి వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి ఉత్సవాల సందర్భంగా ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను ప్రతి సంవత్సరం అధికారికంగా జరపడం జరుగుతుందని, చాలా సంతోషకరమని అన్నారు. ప్రతి ఒక్కరూ మహనీయుల జీవిత చరిత్రను వారి త్యాగాలను గుర్తుంచుకోవాలని మర్చిపోతే మాత్రం మానవ మనుగడకు భవిష్యత్తు కష్టతరం అవుతుందని, నాకోసం పనిచేస్తే నాలోనే ఉండిపోతావు - జనం కోసం పనిచేస్తే జనంలో ఉండిపోతావ్ అని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ ప్రాంతంలోని ఖిలషాపూర్ అనే గ్రామంలో జన్మించారని పశువుల కాపరిగా ఉంటూ రాజుల సైన్యాలను వారి ఆగడాలను ఎదిరించి, అరికట్టి ఉమ్మడి హక్కుల కోసం పోరాడారని, అన్యాయాలను ఎదిరించిన ఆయన జీవిత చరిత్ర మనకు ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో గౌడ్ అన్నలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యల పరిష్కరించడం కొరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించేటట్లు చూస్తానని పేర్కొన్నారు. మహనీయుల విగ్రహాలను త్వరలో ఏర్పాటు చేయుటకు, బీసీ భవన్ ఏర్పాటు చర్యలు తీసుకుంటాం ప్రభుత్వం బి.సి. రిజర్వేషన్ 42 శాతం అమలుకు కట్టుబడి ఉందని, బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలనీ ఈ సందర్భంగా మంత్రి కోరారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులకు కాటమయ్య 100 రక్షక కవచాలను మంత్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఎక్సైజ్ సి ఐ సుధీర్ కుమార్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఇంచార్జీ సర్దార్ సింగ్, బి.సి. కులస్థులు, బి.సి. సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మండపాల వద్ద ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి

గణేష్ ఉత్సవాల నిర్వాహణపై రాచకొండ సీపీ సమావేశం





రంగారెడ్డి, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు అన్నారు.సోమవారం రాచకొండ పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు కమిషనర్ సుధీర్ బాబు రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి జిల్లాలకు సంబంధించి గణేష్ ఉత్సవాలు నిర్వాహణ పై అదనపు కలెక్టర్లు, డిసిపిలు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, వాటర్ వర్క్స్, భాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటీ వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ నెల 27వ తేది నుండి సెప్టెంబర్ 6వ తేది వరకు నిర్వహించే గణేష్ ఉత్సవాలు ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. మండపాల ఏర్పాటు నిబంధనలకు లోబడి ఏర్పాటు చేయాలని తెలిపారు. మండపాల వద్ద ఎటువంటి విద్యుత్, అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. నిమజ్జనం చేసే సమయంలో చెరువుల వద్ద లైటింగ్, క్రేన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, శానిటేషన్ చేపట్టి పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడటం జరుగుతుంది అని తెలిపారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం అని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుండి పాల్గొన్న ఇంచార్జి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో గణేష్ ఉత్సవాలు శాంతి భద్రతల మధ్య శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో భువనగిరి అదనపు కలెక్టర్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి, విద్యుత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,ఆర్ అండ్ బి, వాటర్ వర్క్స్, పోలీసు అధికారులు, భాగ్యనగర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మెడికల్ షాప్ ను ఓపెనింగ్ చేసిన బడే నాగజ్యోతి, మాజీ రెడ్ కో చైర్మన్



గోవిందరావుపేట, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): సోమవారం గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామంలో బుర్రి శ్యాంబాబు నూతన మెడికల్ షాప్ రిబ్బన్ కట్ చేసి ఓపెనింగ్ చేసిన బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి, మాజీ రెడ్ కో చైర్మన్ వై. సతీష్ రెడ్డి, ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, ములుగు మండల అధ్యక్షుడు సాని కొమ్ము రమేష్ రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు కోగిల మహేష్, మాజీ ఎంపిటిసి వెలుశాల స్వరూప, అజ్మీర సురేష్, లకావత్ చందులాల్, ఎం. వెంకన్న, అజీజ్ పాషా, బొల్లం శివ, ఈర్ల అజయ్, ఊట్ల మోహన్, ఎ. హనుమంతరావు, సూరనేని రవీంద్రావు, చుంచు యాకూబ్, పసుల భద్రయ్య, గజ్జి ఎలంధర్, ఇరుప విజయ, తాటికొండ శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరాపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం లక్షా 13 వేల కోట్ల వ్యయం

అవసరాల మేరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలి

పరిశ్రమలకు యూరియా డైవర్ట్ కాకుండా పటిష్ట చర్యలు





ములుగు జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): వానాకాలం పంట సాగుకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే.రామ కృష్ణ రావు, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావులతో కలిసి యూరియా, ఎరువుల లభ్యత పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, మే చివరి వారంలో వర్షాలు ప్రారంభం కావడం, జూలై, ఆగస్టు నెలలో మంచి వర్షాలు కురువడం వల్ల రాష్ట్రంలో వరి, పత్తి, మిర్చి, పప్పు దినుసులు వంటి అనేక రకాల పంటలు రైతులు ఒకేసారి సాగు చేయడం, మన రాష్ట్రానికి కేటాయించిన యూరియా స్టాక్ సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వంటి వివిధ కారణాల వల్ల కొంత యూరియా సమస్య ఉందని అన్నారు. చైనా, జర్మనీ, ఇరాన్, యుమాన్ వంటి పలు దేశాల నుంచి రావాల్సిన యూరియా సరఫరా కావడం లేదని అన్నారు. ఏప్రిల్ నెల నుంచి కేటాయింపుల మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా కాలేదని, మొత్తం మూడు లక్షల మెట్రిక్ టన్నుల తక్కువ సరఫరా జరిగిందని మంత్రి తెలిపారు. మన దగ్గర గతంలో ఉన్న 2 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ తో రైతులకు ఇప్పటి వరకు కొంత మేర సరఫరా చేసామని అన్నారు. రుణ మాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ , రైతు బీమా, ధాన్యం కొనుగోలు వంటి అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇప్పటివరకు లక్షా 13 వేల కోట్లు ఖర్చు చేసిందని, యూరియా కోసం రైతులు గంటల సమయం లైన్ లో నిలబడటం వల్ల కొంత అసంతృప్తి చెందుతున్నారని మంత్రి తెలిపారు. రాబోయే 45 రోజుల పాటు యూరియా సరఫరా పై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. మండల స్థాయిలో స్టాక్ వివరాలు మానిటరింగ్ చేయాలని, ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి యూరియా తరలించాలని అన్నారు. ప్రస్తుతం ప్రైవేటు డీలర్ల వద్ద 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, అది సక్రమంగా విక్రయం జరగాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమలకు యూరియా డైవర్ట్ కావడానికి వీలు లేదని, రైతులు అధికంగా స్టాక్ పెట్టుకోవద్దని, అవసరం మేరకే కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. యూరియా సరఫరా పై పత్రికలో వ్యతిరేక వార్తలు రాకుండా ముందస్తుగా పరిస్థితుల గురించి పాత్రికేయులకు వివరించాలని అన్నారు. యూరియా సరఫరా చేసేందుకు చేపట్టిన చర్యలు రైతులకు మీడియా ద్వారా

తెలిసేలా చూడాలని అన్నారు. సీఎస్ కే.రామకృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఒక వైపు విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ యూరియా కొరత కొంత ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. జియో పొలిటికల్ కారణాల వల్ల దేశానికి యూరియా సరఫరా సరఫరా దెబ్బతిందని, రామగుండం ఆర్.ఎఫ్.సి.ఎల్ ప్లాంట్ లో సాంకేతిక కారణాలవల్ల ఉత్పత్తి పలుమార్లు నిలిచిపోవడం నువ్వంటే కారణాల వల్ల మన దగ్గర కొంత యూరియా కోరత ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు వచ్చే ఎరువుల సరఫరాలో 3 లక్షల మెట్రిక్ టన్నుల కోత ఉన్నప్పటికీ, గత సంవత్సరంతో పోలిస్తే నేటికి లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులు అదనంగా రైతులకు సరఫరా చేశామని అన్నారు. రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ వీలైనంత అధికంగా యూరియా తీసుకొని వచ్చేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. రైతులకు వ్యవసాయం కోసం కేటాయించిన పారిశ్రామిక అవసరాల కోసం అక్రమంగా తరలిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం కొంత సమాచారం అందించిందని అన్నారు. యూరియా, ఇతర ఎరువుల లభ్యత వివరాలను కలెక్టర్ ప్రతిరోజు పర్యవేక్షించాలని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మార్క్ ఫెడ్, ప్రైవేట్ కంపెనీల వద్ద మండల స్థాయి వరకు స్టాక్ ఎంత ఉందో రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని అన్నారు. మండలాల వారీగా సాగు ఎంత అవుతుంది, ఎరువుల లభ్యత బేరీజు వేసుకొని అందుబాటులో ఉన్న ఎరువుల స్టాక్ సమర్థవంతంగా శాస్త్రీయంగా కేటాయింపు చేయాలని సూచించారు. ప్రతిరోజు జిల్లాలకు ఎరువుల రేక్ స్టాక్ ఎంత వరకు రాబోతున్నాయి వంటి అంశాలను కలెక్టర్ కు ముందస్తుగా తెలియజేస్తామని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా వ్యవసాయం కోసం మాత్రమే వినియోగించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, రైతులు ముందస్తుగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దని, ప్రస్తుత అవసరాల కోసం మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని అన్నారు. వ్యవసాయ అధికారులతో పాటు జిల్లాలో ఇతర ముఖ్యమైన అధికారులతో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి ప్రైవేట్ ఎరువుల డీలర్ల షాపు లను ఆకస్మిక తనిఖీ చేయాలని అన్నారు. యూరియా అవసరం ఉన్న పరిశ్రమలు జిల్లాలో ఉంటే వాటిని ఆకస్మిక తనిఖీ చేయాలని, వ్యవసాయ సంబంధిత ఎరువులను పరిశ్రమల కోసం వినియోగిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. జూన్, జూలై నెలల్లో అధికంగా యూరియా కొనుగోలు చేసిన బయ్యర్స్, రెగ్యులర్ గా కొనుగోలు చేసే బయ్యర్స్ వివరాలను ట్రాక్ చేయాలని, వీరు ఎక్కడైనా యూరియా డైవర్ట్ చేస్తున్నారా పరిశీలించాలని అన్నారు.

జిల్లాలలో అవకాశం ఉన్న చోట ప్రత్యామ్నాయంగా డ్రోన్ ద్వారా నానో యూరియా, డిఏపి కాంప్లెక్స్ ప్రోత్సహించాలని

సి.ఎస్ తెలిపారు. జిల్లాలో ఎరువులు, యూరియా లభ్యత, సరఫరా పై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో యూరియా కోసం అనవసరంగా రైతులు లైన్ లో నిలబడకుండా ఎప్పుడు సరఫరా చేస్తామనే అంశం స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ఆదిలాబాద్, సూర్యాపేట, నిజామాబాద్, నారాయణ పేట వంటి సరిహద్దు జిల్లాలో ఇతర రాష్ట్రాల రైతులకు యూరియా అమ్మకుండా చూడాలని, మన స్టాక్ బ్లాక్ మార్కెట్ కాకుండా బోర్డర్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించాలి

ఆన్లైన్ ద్వారా యూరియా అమ్మకాలు జరపాలి

రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): నానో యూరియా వినియోగం పై రైతులకు అవగాహన కల్పించాలని, యూరియా అమ్మకాలు ఆన్లైన్ ద్వారా మాత్రమే జరపాలని, భారీ వర్షాల కారణంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, జిల్లా కలెక్టర్ సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరం నుండి జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, ఆగ్రోస్ వ్యవసాయ దుకాణాల ద్వారా, ఇతర ప్రైవేటు షాపుల ద్వారా యూరియా విక్రయించాలని, అవసరం ఉన్నచోట డిమాండ్ కనుగుణంగా యూరియాను తెప్పించడం కోసం ప్రతిపాదనలు పంపామని, అందుకు అనుగుణంగా సంబంధిత మండల స్థాయి అధికారులు రైతు వివరాలు పాసుబుక్, ఆధార్ కార్డ్, ద్వారా ఆన్లైన్ విధానంలో ప్రస్తుతం ఉన్న యూరియాను సరఫరా చేయాలన్నారు. యూరియాను అధిక ధరలకు అసలు విక్రయించకూడదని, కృత్రిమ కొరత సృష్టించవద్దని ఆయన సూచించారు. సహకార శాఖ, ఫర్టిలైజర్స్ షాప్ యజమానులు రైతులకు యంత్రాంగానికి సహకరిస్తూ ఉండాలని సూచించారు. అనవసర వదంతులను రైతులు అసలు నమ్మవద్దని తెలిపారు. కొంతమంది అక్రమ నిల్వలు చేసినట్లు, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు, తమ దృష్టికి వచ్చిందని అట్టి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీల ద్వారా నిత్యం ఫర్టిలైజర్ స్ దుకాణాలను తనిఖీ చేయాలని, పి ఓ ఎం ఎస్, ఆన్లైన్, గోడౌన్ నిలువలు సరిపడాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న సేల్స్ వివరాలను స్టాక్ వివరాలను విషయ సూచిక ద్వారా రైతులకు తెలియపరచాలని ఆయన కోరారు, సంబంధిత అన్ని విభాగాలు సమన్వయంతో కలిసి పనిచేసే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను పంపిణీ చేయాలని ఆయన సూచించారు,

నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రస్తుతం వేయవలసిన యూరియా ఫర్టిలైజర్స్ గురించి స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికల ద్వారా ప్రజలకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు యూరియా అమ్మకాలు చేయాలన్నారు. భారీ వర్షాల కారణంగా వరదలు పెరిగే అవకాశం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అధికారులు ప్రధాన కార్య స్థానంలోనే ఉండాలని నిత్యం నివేదికలు సమర్పించాలని వంతెనలు, ట్యాంకులు, లో లెవె ల్ కాజ్వేలు, నిత్యం గమనిస్తూ ఉండి ప్రజలకు వరదల వలన ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఇబ్బంది కలగకుండా పోలీస్ యంత్రాంగం జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టించవద్దని ఆయన అన్నారు. వీలైతే టోకెన్ స్మార్ట్ ల ద్వారా అమ్మకాలు జరపాలని సూచించారు.

పూర్తిస్థాయిలో యూరియా అమ్మకాలపై పోలీస్ యంత్రాంగం దృష్టి పెట్టిందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు పలు సూచనలు చేశారు. సంబంధిత అధికారులు, అన్ని మండలాల నుండి ప్రత్యేక అధికారులు సంబంధిత సిబ్బంది ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

# యూరియా అమ్మకాలపై పర్యవేక్షణ జరగాలి

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): యూరియా అమ్మకాలపై నిరంతర పర్యవేక్షణ జరగాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి సీఎస్ రామ కృష్ణారావు, కార్యదర్శి రఘునందన్ రావు, డైరెక్టర్ డా గోపి లతో కలిసి యూరియా అమ్మకాలు, సరఫరాపై అన్ని జిల్లాల కలెక్టర్లు, సిపిలు, ఎస్పిలు, వ్యవసాయ అధికారులతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయానికి కాకుండా ఇతర రంగాలకు యూరియా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజన్ ముందుగా ప్రారంభం కావడంతో పాటు అన్ని రకాల పంటలు ఒకేసారి సాగు చేయడం వల్ల యూరియా వినియోగం పెరిగి యూరియా అమ్మకాలు అధికంగా జరిగాయని తెలిపారు. మన రాష్ట్రానికి రావాల్సిన 3 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా తక్కువ వచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా ఎన్ని ఎకరాల్లో వరి సాగు జరిగింది. వ్యవసాయ అధికారులకు సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ టీములు ఏర్పాటు ద్వారా నిరంతర పర్యవేక్షణ జరగాలని సూచించారు. ప్రయివేటు డీలర్లు, మార్క్ ఫెడ్, సహకార సంఘాల దుకాణాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు జిల్లాలో యూరియా సరఫరా, ఇతర ఎరువులకు సంబంధించిన నివేదికలు పంపించాలన్నారు. జిల్లాలో యూరియా ఇతర ఎరువుల సరఫరా గురించి ఏ రోజు కా రోజు తెలుసుకోవాలని తెలిపారు. గతః సంవత్సరంతో పోలిస్తే ఈ రోజు వరకు లక్ష మెట్రిక్ టన్నుల యూరియాను ఎక్కువగా సరఫరా చేశామన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రతి రోజు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జిల్లాలో, మండలాల వారిగా ఉన్న యూరియా స్టాక్స్ గురించి పూర్తి నివేదిక ఇవ్వాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ అనుమతితో మాత్రమే మండలాలకు యూరియా పంపిణీ చేయాలని తెలిపారు. రాబోయే 45 రోజులు వ్యవసాయ శాఖ అధికారులు పంట సాగు కాలం నుండి ఎంత యూరియా అవసరమో జిల్లా కలెక్టర్ కు తెలుపాలని సూచించారు. ప్రతి రోజు జిల్లాకు వచ్చే స్టాక్ వివరాలు కచ్చితంగా తెలపాలని, పంట సాగు ఆధారంగా యూరియా వినియోగించే విధముగా అవగహన కల్పించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే కొన్ని జిల్లాలకు ఎక్కువ మొత్తంలో యూరియా సరఫరా చేశామని, యూరియా పంపిణీలో కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. యూరియా వాడకం గురించి సైంటిస్టుల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులతో కలిపి టాస్క్ ఫోర్స్ టీములను ఏర్పాటు చేసి పటిష్ట పర్యవేక్షణ చేయాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ టీములు ఆకస్మికంగా రిటైల్ షాపులు తనికీలు చేపట్టాలని తెలిపారు. రైతులకు చెందాల్సిన యూరియా బ్లాక్ చేస్తే అలాంటి వారిపై పోలీస్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో ఉన్న పరిశ్రమల జాబితా తయారు చేసుకుని పరిశ్రమలను ఆకస్మిక తనికి చేపట్టాలని తెలిపారు. పరిశ్రమలకు యూరియా సరఫరా చేసే రిటైల్ డీలర్లను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. గవర్నెట్ ఆఫ్ ఇండియా వెబ్సైట్ లో గత నెలలో జిల్లాలో టాప్ 20లో ఎక్కువ మొత్తం యూరియా కొనుగోలు చేసిన రైతులు గుర్తించి అతని భూమి వివరాలు గుర్తించాలని, దుర్వినియోగం కాకుండా పటిష్ట మైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. యూరియా అక్రమ రవాణా చేస్తున్న వారిని గుర్తించి పోలీస్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. యూరియా ఎక్కువ అవసరం ఉన్న చోట నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని, డ్రోన్లు, బయో ఎరువులు వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎరువులు లభ్యతపై రైతులకు సంపూర్ణమైన సమాచారం అందించాలని వివరించారు. మీడియాకు సైతం పూర్తి సమాచారం అందించాలన్నారు. వచ్చే నాలుగు రోజులలో ఇతర దేశాల నుండి యూరియా మన దేశానికి రాబోతుందని, సమస్య తీరిపోతుందని రైతులు ఆందోళన పడొద్దని అన్నారు. సరిహద్దు జిల్లాలో పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో సరిహద్దు చెక్ పోస్ట్ ల వద్ద తనికీలు చేపట్టాలని స్పష్టం చేశారు. కాలం ముందుగానే రావడం, రాష్ట్రంలో వర్షాలు మొదలైనాయి.ఇతర దేశాల నుండి మనకు యూరియా రావలసి ఉండగా సమయానికి మనకు అందుబాటులోకి రాలేదని, ఆగస్టులో ఒక్కసారిగా యూరియా రైతులకు అవసరం పడిందని, యూరియా రేటు తక్కువగా ఉన్నందున రైతులు యూరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం రైతులు కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని, 9 రోజులలో 9వేల కోట్లు రైతు భరోసా, రుణమాఫీ చేశామని దీని వల్ల రైతులు సంతోషంగా ఉన్నారని, యూరియా కొరత వస్తే రైతులు ఇబ్బంది పడతారని, తద్వారా ఇబ్బందులు వస్తాయని తెలిపారు. రాబోయే 10 రోజులు జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ఎన్ని పథకాలు అమలు చేసిన యూరియా కొరత వస్తే చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు రంగంలోకి దిగాల్సిన అవసరం ఉందన్నారు.రైతులు క్యూ లైన్ల లో నిలబడే జిల్లాలలో కలెక్టర్లు యూరియాకు సంబంధించిన నివేదిక పరిశీలించాలని స్పష్టం చేశారు. తనికీలు చేపట్టాలి, ప్రైవేటు డీలర్లు దగ్గర స్టాక్ పరిశీలించాలి, కలెక్టర్లు అడ్వాన్స్ గా ప్రణాళికలు చేసుకొని యూరియా కొరత రాకుండా చూడాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో ఏ పంటకు ఎంత యూరియా అవసరమో కనుక్కొని యూరియా కొరత లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలో యూరియా లభ్యత తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు తనకు మండల వారిగా స్టాకు వివరాలపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. సహకార సంగం, మార్క్ ఫెడ్, ప్రైవేటు డీలర్లు అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించబోమని కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు యూరియా వాడితే పోలీస్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అధికంగా యూరియా కొనుగోలు చేసిన రైతుల వివరాలతో అధికంగా విక్రయించిన దుకాణాల జాబితా ఇవ్వాలని స్పష్టం చేశారు. అంతరాష్ట్ర సరిహద్దు కాళేశ్వరం వద్ద పటిష్ట పర్యవేక్షణ చేయాలని యూరియా ఇతర రాష్ట్రాల కు తరలించకుండా పటిష్టమైన తనికీలు చేయాలని తెలిపారు. రైతులు ఆధుర్దా పడొద్దని సరిపోను నిల్వాలున్నాయని తెలిపారు. అవసరం మేరకు తీసుకోవాలని, ముందస్తుగా తీసుకుని నిల్వ పెట్టుకోవడం వల్ల కొరత వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# 22 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): ఇల్లందు నియోజకవర్గంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విస్తృతంగా పర్యటించి, 22 కోట్ల వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొన్నారు. టేకులపల్లి మండల పరిధిలో పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న కోక్యా తండా నుండి పాత తడికలపూడి వరకు 1.25 కోట్ల రూపాయలతో బీటీ రహదారి, థవుర్యా తండా నుండి కోక్యా తండా వరకు 1.45 కోట్ల రూపాయలతో బీటీ రహదారి, థవుర్యా తండా నుండి పాత తడికలపూడి వరకు లక్ష్మీపురం వద్ద రూ. 83 లక్షల వ్యయంతో స్లాబ్ కల్వర్ట్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పాతతండా నుండి రాంపురం వరకు2.5 కోట్ల రూపాయలతో హై లెవల్ వంతెన నిర్మాణానికి పేట్రంచేలక వద్ద రెండు కోట్ల రూపాయలతో వంతెన నిర్మాణానికి, కిష్టారం గ్రామంలో పీఆర్ రోడ్ నుండి స్మశానవాటిక వరకు హై లెవల్ వంతెన నిర్మాణానికి మూడు కోట్ల రూపాయల నిర్మాణ వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఇల్లందు మండల పరిధిలో మొండికుంట నుండి రామచంద్రాపురం రహదారిపై వాగు వద్ద ఆరు కోట్ల రూపాయలతో నిర్మించనున్న హై లెవల్ వంతెన , ఇల్లందు పట్టణంలోని జె.కె. కాలనీలో 1.56 కోట్లతో మినీ స్టేడియం అభివృద్ధి పనులు మరియు సౌకర్యాల కల్పనకు పనులకు, శంకుస్థాపన చేశారు. రహదారులు మరియు భవనాలు శాఖ ఆధ్వర్యంలో ఇల్లందు మండలంలోని లలితాపురం గ్రామంలో ఖమ్మం యెల్లందు రహదారి విస్తరణ, డివైడర్లు మరియు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు రూ. 3.5 కోట్ల వ్యయంతో పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి కట్టుబడి ఉందని, ముఖ్యంగా రహదారులు, వంతెనలు, క్రీడా మైదానాలు వంటి మౌలిక వసతులను కల్పించడం ద్వారా ప్రజలకు శాశ్వత సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థికాభివృద్ధికి రవాణా సౌకర్యాలు అత్యంత కీలకమని, ఈ దిశగా రోడ్లు, వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జిల్లాలో రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి%-%సంక్షేమ కార్యక్రమాలు అమలులోకి రాబోతున్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఆర్ అండ్ బి శాఖ ఈ ఈ వెంకటేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, 375వ జయంతి వేడుకలు



మహబూబాబాద్ జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): అధికారికంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ రెవెన్యు కె.అనిల్ కుమార్ తో హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గొప్ప పోరాట యోధుడని సామాన్య కుటుంబంలో పుట్టి, అతి గొప్ప స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి అని ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదు శక్తి అని నిరూపించారని అన్నారు. నిజాం పాలన పై తిరుగుబాటు చేసి వారి ఆగడాల కు అడ్డుకట్ట వేసేందుకు యుద్ధం చేసి గుణపాఠం చెప్పారన్నారు. ఆయన మన ప్రాంతంలో పుట్టడం మన అదృష్టం అన్నారు. ఆయన పోరాటం భావి తరాలకు స్ఫూర్తి గా నిలుస్తుందన్నారు. అందుకే సర్వాయి పాపన్న జయంతి, వర్ధంతి లను ప్రభుత్వమే నిర్వహిస్తున్నదన్నారు. గౌడ కులస్తులు వృత్తిని ప్రేమిస్తూ పిల్లలను బాగా చదివించుకోవాలని, మీరు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సమాజంలో అన్ని వర్గాల ప్రజలు బాగుపడితేనే రాష్ట్రం దేశం బాగుపడుతుందని గౌడలకు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.సి.సంక్షేమ అధికారి నరసింహాస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు గౌడ సంఘాల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానిని కలిసిన వ్యోమగామి శుభాన్షు శుక్లా

న్యూ ఢిల్లీ, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): భారత వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆయన అధికారిక నివాసం 7 లోక్ కళ్యాణ్ మార్గ్‌లో కలిశారు. ఈ సందర్భంగా శుభాన్షు తన చారిత్రాత్మక ఆక్సియం-4 మిషన్ సందర్భంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం కు తీసుకెళ్లిన త్రివర్ణ పతాకాన్ని ప్రధాని మోదీకి బహూకరించారు. ఈ త్రివర్ణ పతాకం భారతదేశం మానవ అంతరిక్ష విమానాల కొత్త యుగానికి ప్రతీక. అంతరిక్షం నుంచి తీసిన భూమి చిత్రాలను బహూకరించారు. ప్రధాని మోడీ శుభాన్షును కౌగిలించుకుని స్వాగతం పలికారు. శుభాన్షు తన అంతరిక్ష ప్రయాణానికి సంబంధించిన చిత్రాలను ప్రధానమంత్రికి చూపించారు. ప్రధాని మోడీతో జరిగిన సమావేశంలో, శుభాన్షు శుక్లా తన మిషన్ కు సంబంధించిన సవాళ్లను పంచుకున్నారు. ఆక్సియం-4 మిషన్‌లో ఆయన నిర్వహించిన శాస్త్రీయ ప్రయోగాలు, మానవ శరీరంపై సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావాలను అధ్యయనం చేయడం, అంతరిక్షంలో వ్యవసాయానికి ఉపయోగించే సాంకేతికతలు వంటివి భారతదేశ గగన్‌యాన్ కార్యక్రమానికి ముఖ్యమైనవి. శుభాన్షు శుక్లా సాంకేతిక విజయాలను మోడీ ప్రశంసించారు. భారత వైమానిక దళ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా జూన్‌లో ఆక్సియం-4 మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. భారత వైమానిక దళ వింగ్ కమాండర్ రాకేష్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి వెళ్ళిన రెండవ భారతీయుడు ఆయన. జూలై 16న మిషన్ పూర్తి చేసిన తర్వాత శుభాన్షు భూమికి తిరిగి వచ్చారు. సోమవారం ఉదయం పార్లమెంటు శుభాన్షు శుక్లా చేసిన యాక్స్-4 మిషన్‌ను ప్రశంసించింది.

# కొమురవెల్లికి రైలు కనెక్టివిటీ

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): కొమురవెల్లి మల్లన్న భక్తులకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లిలో నిర్మాణంలో ఉన్న కొత్త హాల్ట్ స్టేషన్ త్వరలో పూర్తికానుంది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సోమవారం ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్ట్ చేశారు. కొమురవెల్లి మల్లన్న ఆలయానికి త్వరలో రైలు కనెక్టివిటీ అంటూ రైల్వే స్టేషన్ వివరాలు పంచుకున్నారు. కొమురవెల్లి రైల్వే హాల్ట్ స్టేషన్ పనుల స్థితి 95% పూర్తి అయ్యాయని ప్రకటించారు. ప్లాట్‌ఫామ్ షెల్టర్, హై లెవల్ ప్లాట్‌ఫామ్ పనులు పూర్తి అయినట్లు తెలిపారు. స్టేషన్ భవనం ఆర్కిటెక్చరల్ ఎలివేషన్ పనులు నడుస్తున్నట్లు తెలిపారు. ఈ స్టేషన్, హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల నుంచి కొమురవెల్లి మల్లన్న దేవాలయానికి వచ్చే భక్తులకు సులభమైన రైల్వే కనెక్టివిటీని కల్పించడంతో పాటు స్థానిక రవాణా సౌకర్యాలను కూడా పెంపొందిస్తుందని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు, ముఖ్య ఆధ్యాత్మిక కేంద్రాలను అనుసంధానం చేయాలనే ప్రధాని మోడీ సంకల్పాన్ని చాటుతోందని కేంద్ర మంత్రి తెలిపారు.



# సరిపడా యూరియా నిల్వలు

**సరఫరా సాఫీగా జరగాలి.. సన్న చిన్న కారు రైతులకు మొదటి ప్రాధాన్యం**

**రిజిస్టర్‌లు అప్డేట్ ఉండాలి.. నిరంతర పర్యవేక్షణ ముఖ్యం**

**యూరియా నిల్వల పైన సమాచారం ఇవ్వాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ఎక్కడ యూరియా కొరత లేదని సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు ప్రతీ రోజూ క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలనీ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ రివ్యూ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా 1273.935 మెట్రిక్ టన్నులు, డీఏపీ (డై అమోనియం ఫాస్పేట్): 245.65 మెట్రిక్ టన్నులు,

ఎం.ఓ.పి. (మ్యూరేట్ ఆఫ్ పొటాష్): 393.25 మెట్రిక్ టన్నులు, ఎస్.ఎస్.పి. (సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) 386.77 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ (నైట్రోజన్ ఫాస్ఫరస్ & పొటాష్): 3404.597 మెట్రిక్ టన్నులు, జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎరువుల నిల్వ 501.187 మెట్రిక్ టన్నులు హోల్సేల్ వ్యాపారుల వద్ద, 3953.725 మెట్రిక్ టన్నులు రిటైలర్ల వద్ద, 1054.25 మెట్రిక్ టన్నులు సొసైటీల వద్ద, 203.64 మెట్రిక్ టన్నులు టీ.ఎస్. మార్క్‌ఫెడ్ వద్ద నిల్వలు ఉన్నాయని మొత్తం కలిపి 5815.14 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇవన్నీ రైతులకు సరిగ్గా సరఫరా అయ్యేల నిరంతర పర్యవేక్షణ జరగాలన్నారు. రిజిస్టర్ లలో వివరాలను నమోదు చేసే పద్ధతి యూరియా అమ్మకాలు సాఫీగా అయ్యేందుకు చాలా దోహదపడిందని ఇలాగే సాగుకి సరిపడా యూరియా అమ్మకం పూర్తి అయ్యే వరకు వ్యవసాయ, స్పెషల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. వచ్చే పది రోజులకి గాను 800 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కూడా జరగనుందని 5 ఎక్కరాలు ఎక్కువగా ఉన్న రైతు యూరియా కొనుగోలు కోసం వస్తే వారి నుండి తప్పనిసరిగా పట్టాదారు పాస్ బుక్ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఏ మండలంలో ఎంత స్టాక్ ఉందనే సమాచారం రైతులకు తెలపాలన్నారు. ఒకే షాప్ దగ్గర క్రౌడ్ కాకుండా రైతులు ఇబ్బంది పడకుండా యూరియా కొనుగోలు చేసుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సన్న, చిన్న కారు రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని రైతులు ఆందోళన చెందకుండ యూరియా సరఫరా సాఫీగా సాగేలా చూడాలన్నారు. అనంతరం జనగామ పట్టణం లోని వివిధ ఫర్టిలైజర్ షాప్ లను, గోదాం లను డీసీపీ రాజమహేంద్ర నాయక్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తనిఖీ చేసి రిజిస్టర్ లను అప్ డేట్ గా పెడుతున్నారా లేదా.. ఏ రైతు కు ఎన్ని బస్తాలు అమ్ముతున్నారు అని అలాగే నమోదు చేసిన వివరాలు సరైనవ లేదా అని రిజిస్టర్ లో నమోదు చేసిన ఫోన్ నెంబర్ లకు ఫోన్ చేపించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరికైన ఇబ్బంది కలిగితే మండల వ్యవసాయ అధికారి లేదా విస్తరణ అధికారిని సంప్రదించ్చాలన్నారు. యూరియా కొనుగోలు విషయంలో ఫిర్యాదులు ఇవ్వదలిచిన వారు 8977745512 ఫోన్ నెంబర్ కి సంప్రదించాలన్నారు. అవసరం మేరకే రైతులు యూరియా కొనుగోలు చేసి సహకరించాలన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అవసరమైన ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయన్నారు. కేవలం యూరియా నే కాకుండా నత్రజని ఆధారిత కాంప్లెక్స్ ఎరువులను, నానో యూరియాను కూడా వాడవలసిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.

**మండలాల వారీగా యూరియా నిల్వల వివరాలు**

బచ్చన్నపేట 10.516 మెట్రిక్ టన్నులు, చిల్పూర్ 82.29, దేవరుప్పుల 181.335, ఘన్‌పూర్ స్టేషన్ 172.545, జనగామ 155.32, కొడకండ్ల 56.745, లింగాల ఘన్‌పూర్ 99.375, నర్మెట్ట 74.295, పాలకుర్తి 80.405, రఘునాథ్‌పల్లి 192.457, తరిగొప్పుల 21.51, జఫర్‌గఢ్ 69.93 ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి, ADA, AEOలు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 92 ఫిర్యాదులు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 92 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 33, జిడబ్ల్యూఎంసీ 18, గృహ నిర్మాణ శాఖ 9, వైద్య ఆరోగ్య, విద్య శాఖకు 4 చొప్పున, ఇతర శాఖలకు సంబంధించినవి 24 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు మానవతా దృక్పథంతో పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, రోడ్లు మరియు రవాణా, వైద్య ఆరోగ్య శాఖల జిల్లా అధికారులు శాఖల వారిగా అంతర్గత సమావేశాలు నిర్వహించుకొని పరిస్థితుల కనుగుణంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎఓ అనురాధ, డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డిడబ్ల్యూఓ ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, వివిధ శాఖల జిల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పార్లమెంట్‌లో ఎన్నికల సంస్కరణలపై చర్చించాలి!

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వ్యవహారం రచ్చ కొనసాగుతోంది. నిజంగానే ఇందులో లోపాలు ఉంటే పరిశీలించి, పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉంది. అందుకు బీహార్ ఎన్నికల సంఘం వెంటనే కార్యాచరణకు దిగాల్సి ఉంది. ఎందుకంటే దేశంలో ఇన్నేళ్లయినా సమగ్ర ఓటు విధానం లేకుండా పోయింది. రాజకీయ నాయకులు ప్రమేయంతో మార్పులు, చేర్పులు చేయడం అలవాటయ్యింది. వ్యవస్థీకృత లోపాలకు ఇన్నేళ్లు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీది ప్రధాన బాధ్యత. అలాగే దానిని కొనసాగిస్తున్న బిజెపిది కూడా. ఈ రెండు పార్టీల పాలనలో కేంద్ర ఎన్నికల సంఘం సర్వస్వతంత్రంగా పని చేయకుండా డమ్మీ పాత్రను పోషించేలా తయారయ్యింది. అలాగే గత పదేళ్లుగా అధికారం చెలాయిస్తున్న మోడీ కూడా ఎన్నికల సంఘాన్ని పటిష్టం చేయకుండా, మరింతగా దిగజారేలా చేస్తూ వచ్చారు. నిజానికి ఓటరు కార్డును పక్కాగా, పకడ్బందీగా రూపొందించడం పెద్ద పనికాదు. ఆధార్, పాన్ కార్డు తరహాలో పక్కాగా ఓటరు కార్డును రూపొందించవచ్చు. కానీ ఎన్నికల సంఘం ఈ తరహా ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే ఎన్నికల సంఘం తీరుపై కారాలు మిరియాలు నూరుతున్న రాహుల్ ఎందుకు ఎన్నికల సంస్కరణల పై మాట్లాడడం లేదు. ఎందుకు నిజాయితీగా వ్యవహరించడం లేదు. ఎందుకు పార్లమెంటులో చర్చకు దిగడం లేదు. కేవలం బీహార్ విషయంమే గాకుండా మొత్తం ఎన్నికల సంస్కరణలపై మాట్లాడడం ద్వారా, విపక్షనేతగా తన సత్తా చాటుకోవాలి. అలా కాకుండా బీహార్ జాబితాను ముందేసుకుని మాట్లాడితే, ఆ రాష్ట్ర ఎన్నికలు ముగిసాక సమస్య మళ్లీ మొదటికే వస్తుంది. ఎన్నికల జాబితాలో ఎప్పుడు పడితే అప్పుడు ఇష్టం వచ్చినట్లు మార్పులు చేయడం, ఒకే ఇంటినూ వందల సంఖ్యలో ఓట్లు ఉండడం, ఒకే ఇంట్లో ఉన్నవారికి వేర్వేరు పోలింగ్ బూతుల్లో ఓటు కల్పించడం చూస్తున్నాం. నిజానికి దొంగ ఓట్ల సమస్య కూడా ఉంది. దొంగ ఓట్లు వేస్తే ఉరిశిక్ష విధించాలి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు అర్హత కోల్పోయేలా చేయాలి. తెలంగానలో పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, ఈ విషయంలో రాహుల్ ఎందుకు మాట్లాడడం లేదో చెప్పాలి. అందుకే ఎన్నికల సంస్కరణలపై రాహుల్ ముందు మాట్లాడాలి. ప్రతిపక్షనేతగా బాధ్యత తీసుకోవాలి. మోడీ సర్కార్‌ను నిలదీయడం కాదు. దేశ భవిష్యత్ కోసం బాధ్యతగల ప్రతిపక్ష నేతగా మాట్లాడాలి. పటిష్టమైన ఎన్నికల విధానం అమలు కావాలంటే సంస్కరణలు రావాలి. ఇందులో ఉన్న లోటుపాట్లకు సంబంధించి అన్ని విషయాల్లో చర్చ జరగాలి. ఈ పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరిగేలా రాహుల్ బాధ్యత తీసుకోవాలి. ఈ పని ఇన్నేళ్లుగా ఎందుకు చేయడం లేదన్నది గమనించాలి. ఇకపోతే ఒక్క శేషన్ కాలంలోనే ఎన్నికల సంఘం గట్టిగా పనిచేసింది. బీహార్ జాబితా వ్యవహారపై సవాల్ చేసిన పిటిషన్లపై విచారణలో భాగంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం భారత ఎన్నికల సంఘం రెండు ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్ల జాబితాను, తీసివేతకు కారణాలతో సహా ప్రచురించాలని తెలిపింది. ఆధార్ కార్డును ఒక ధ్రువీకరణ పత్రంగా అంగీకరించాలని కూడా పేర్కొంది. 'సర్'ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఇంకా కొనసాగు తోంది. అయితే 'సర్'కు సంబంధించి, న్యాయసమీక్ష పరిధిలోకి రాని, అంశాలు అనేకం ఉన్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ లాంటి కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా నిర్వహించలేదు. జననమరణాలు సహజం. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం సమర్థనీయమే. డబుల్ ఓట్లు ఉన్నా, పలు నియోజకవర్గాల్లో ఓటు ఉన్నా తొలగించాల్సిందే. అందుకు ప్రజలను కూడా బధ్యులు చేయాలి. అలాగే 18 సంవత్సరాల నిండిన యువతీ యువకుల పేర్లను ఓటర్ల జాబితాలో విధిగా చేర్చడం కూడా ముఖ్యమే. ఇకపోతే బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ తొలిదశను కేవలం 30 రోజులలో ఎందుకు పూర్తి చేశారన్న అనుమానాలు ఉన్నాయి. ప్రత్యేక సవరణలో 64 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాను తొలగించినట్టు ఈసీఐ వెల్లడించింది. వీరిలో 22 లక్షల మంది 'మరణించి నట్టు', 7 లక్షల మంది పలు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేయించు కున్నారని, 36 లక్షల మంది బిహార్ నుంచి శాశ్వతంగా వలస పోయినవారు లేదా ఎటువంటి జాడ తెలియనివారు అని ఈసీఐ పేర్కొంది. నిజంగానే ఇది నిజమైతే సుప్రీం ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం వివరాలు ప్రకటించాలి. 36 లక్షల మంది బిహారీలు 'శాశ్వతంగా వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారని' లేదా 'జాడ తెలియనివారు' అన్న నిర్ణయానికి ఎన్నికల సంఘం నిర్ణయించడానికి గల ఆధారాలు ఇవ్వాలి. కానీ ప్రస్తుత సవరణ తరవాత తాము ఓటు హక్కు కోల్పోతామేమోనని బిహార్‌లో లక్షలాది ఓటర్లు భయపడుతున్నారు. ఈ ఏడాది చివరలో జరగనున్న శాసనసభ ఎన్నికలలో తాము ఓటేసేందుకు లేకుండా పోయిందన్న భయంలో ఉన్నారు. నిజానికి ఇలాంటి చిన్నిచిన్న సమస్యలను కూడా పట్టించుకోకుండా ఎన్నికల సంఘం తన పనితీరును కొనసాగించడం సరికాదు. అందుకే ఎన్నికల సంఘం చట్టబద్ధమైన సంస్థగా వ్యవహరించడం లేదన్న విమర్శలు తరచూ వస్తున్నాయి. ఎవరికో ఒకరికి వత్తాసు పలికేందుకు ఎన్నికల సంఘం పనిచేయరాదు. జవాబుదారీ తనం ముఖ్యం. తాను రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థనని గుర్తించాల్సిందే. అలాగే తప్పులు జరిగినప్పుడు ఎన్నికలతో ప్రమేయమున్న ఓటర్లు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు జవాబుదారీగా కూడా ఉండాలి. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీలు ఆరోపణలు చేసి, పార్లమెంట్‌ను బహిష్క రించడం సరికాదు. కేవలం వాయిదా తీర్మానంలోనే చర్చించాలన్న మూర్ఖపు వాదనా సరికాదు. బీహార్‌తో పాటు మొత్తం ఎన్నికల సంస్కరణలపైనే పెద్ద చర్చ జరగాల్సి ఉంది. దీనికి రాహుల లేదా ఇండియా కూటమి నేతలు సిద్దం కావాలి. పార్లమెంటులో చర్చించడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. వాటి ద్వారా చర్చకు వెళ్లాలి. పార్లమెంట్ బహిష్కరణలు, ర్యాలీలు, విమర్శలు, ధర్నాలు,పాదయాత్రలు వంటివన్నీ పాతపద్ధతులు. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశించినవి మాత్రమే. పార్లమెంటులో చర్చ ద్వారా రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. మోడీ ప్రభుత్వంతప్పిదాలు ఉంటే నిలదీయండి. అలాగే గతంలో తమ పాలనకాలంలో జరిగిన తప్పులంటే క్షమాపణలు కోరండి.

# పేదల చిరకాల వాంఛ నెరవేరుతోంది



**భద్రాద్రి రాముని సాక్షిగా చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం**

**లక్ష మందితో జరగనున్న ఇండ్ల గృహప్రవేశ మహోత్సవం**

**సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 27 ఇళ్ల గృహప్రవేశం**

**పార్టీలకు అతీతంగా పేదలకు ఇళ్లు అందజేస్తున్న ప్రభుత్వం**

**ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో మంత్రి పొంగులేటి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలంపాడు గ్రామంలో ఈనెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు హాజరుకానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు మరియు అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాస్ నాయక్, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టరాగమయి తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గడిచిన పది సంవత్సరాల కాలంలో పేదలకు ఇల్లు అన్న కల కలగానే మిగిలిపోయింది అని అన్నారు. అయితే, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ పథకాన్ని పునఃప్రారంభించి, మొదటి విడతగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇండ్ల మంజూరుతో పేదవాడి చిరకాల వాంఛను ఈ పేదోడి ప్రభుత్వం అయినా ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఈ శ్రావణ మాసం, 21వ తేదీన శుభ ముహూర్తంలో ముఖ్యమంత్రి స్వయంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ మండలం బెండలంపాడు గ్రామంలో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు అని తెలిపారు. ఈ గ్రామంలో మొత్తం 312 ఇండ్లు మంజూరయ్యాగా, వాటిలో 72 ఇండ్లు పూర్తి అయ్యాయి. అందులో 27 ఇండ్లకు ముఖ్యమంత్రి చేతుల మీదగా గృహప్రవేశం జరగనుంది. గతంలో ఏ పేదవాడికీ అందని ఇళ్లను ఇప్పుడు ఈ ప్రభుత్వం పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రతి అర్హునికి అందజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 22,500 కోట్ల రూపాయలతో 4.5 లక్షల ఇళ్లలో, సుమారు 2.5 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. మిగిలిన ఇళ్లు కూడా ఇందిరమ్మ కమిటీల ద్వారా పారదర్శకంగా అర్హులైనవారికి ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. భద్రాద్రి రాముని సన్నిధిలో గతంలో ఈ పథకాన్ని ప్రారంభించాం. ఈరోజు అదే భద్రాద్రి నేలపై ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం జరగడం ఒక చారిత్రక ఘట్టం అని తెలిపారు. జిల్లాలో జరిగే ఈ మహోత్సవానికి సుమారు ఒక లక్ష మంది ప్రజలు పాల్గొంటారని అంచనా. కాబట్టి, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని గొప్ప విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను అన్నారు. 20వ తేదీ మధ్యాహ్నం నుంచే ఇక్కడ ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తాను అని మంత్రి తెలిపారు. అధికారులు చిన్నచిన్న తప్పిదాలు కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పేదవాడి కలలను నిజం చేసే ఈ గృహప్రవేశోత్సవాన్ని ఘనవిజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 21 మధ్యాహ్నం రెండు గంటలకు చంద్రుగొండకు ముఖ్యమంత్రి చేరుకుంటారని, 2:10 బెండలంపాడు చేరుకుని 2:20 కు లబ్ధిదారుల ఇళ్ల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారని, ఒక్కో ఇంటి వద్ద 15 నిమిషాలపాటు లబ్ధిదారులతో మాట్లాడే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2:50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 3:00 గంటల నుంచి ప్రజాసభలో పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు. ఈ సందర్భంలో పోలీస్ బందోబస్తు, వీఐపీల ప్రోటోకాల్, ప్రజా రాకపోకల నియంత్రణ వంటి అంశాలపై ఎస్పీ వివరాలు తెలియజేశారు. రెవెన్యూ శాఖ అదనపు కలెక్టర్ మొత్తం సమన్వయం చేపడతారని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే సమీపంలోని 30 కిలోమీటర్ల పరిధిలోని మండలాల నుండి ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాల (%ూ+ం%) సభ్యుల రాకపోకలపై ప్రత్యేక మొబిలైజేషన్ ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ప్రధాన శాఖలవారీగా తగిన ఏర్పాట్లు చేయాలని, బాధ్యతలు విభజించినట్లు కలెక్టర్ వివరించారు. రోడ్ల మరమ్మత్తులు, బురద తొలగింపు, పిచ్చి మొక్కల నివారణ, డోజర్ల వినియోగం, స్టోన్ డస్ట్ వేసే పనులు సమయానికి పూర్తిచేయాలని, వర్షాల వలన మళ్లీ సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 19వ తేదీ సాయంత్రానికల్లా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, లైటింగ్, తాగునీరు, పార్కింగ్, ప్రజా సౌకర్యాలు, డయాస్ ఏర్పాటు, మీడియా కోసం ప్రత్యేక వేదిక, బారికేడింగ్, భద్రత వంటి అంశాలన్నీ విభాగాలవారీగా సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన రోజున ఎక్సైజ్, సిపిఓ, పోలీసు అధికారులు సమగ్రంగా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా విచ్చేసి గృహప్రవేశాలలో భాగస్వాములు కావడం గిరిజనుల పట్ల ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనం అని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం వలన ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని ఆయన అన్నారు. అధికారులందరూ తమ విధి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం మంత్రి కలెక్టర్, ఎస్పీ మరియు శాసన సభ్యులతో కలిసి హెలిపాడ్ మరియు సభా ప్రాంగణం మరియు ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీజీ ఐ డి సి చైర్మన్ మువ్వ విజయ్ బాబు, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, ట్రైన్ కలెక్టర్ సౌరబ్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీవో మధు, అన్ని శాఖల జిల్లా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలి



## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని జిల్లా కలెక్టర్ డా సత్య శారద అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ డా సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యా రాణి పాల్గొని శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని అన్నారు. బహుజన ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన, ప్రజల కోసం పోరాడిన నేతగా పేరుగాంచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు ఈనాటి సమాజానికి మార్గదర్శకాలు కావాలని, ఆయన చూపిన ధైర్యం, తెగువ, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం అందరికీ ఆదర్శమని, వారి ఆశయాలను కొనసాగించాలని పేర్కొన్నారు. మన పూర్వీకుల జీవన పద్ధతుల్ని, కృషిని ప్రతిబింబించే ఈ వృత్తులను మరువకుండా, తదుపరి తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, గౌడ సంఘ నాయకులు గట్టు రమేష్ గౌడ్, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రమేష్ గౌడ్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ గౌడ్, రాందాస్ గౌడ్, బోనగాని యాదగిరి గౌడ్, చిర్ర రాజు గౌడ్, డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ గౌడ్, గట్టు రమేష్ గౌడ్, కోలా రాజేష్ కుమార్ గౌడ్, అనంతల రమేష్ గౌడు, సుధాకర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులను త్వరగా పరిష్కరించాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ జిల్లా, ఆగస్టు 18 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన 185 వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజలు అందించిన వినతులపై కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సంబంధిత శాఖ అధికారులను వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ను కోరుతూ వినతులను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి వినతులను పెండింగ్ లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, తదితర శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# పొట్ట దగ్గరి కొవ్వుతో ఇబ్బందులు పడుతున్నారా..?

## అయితే ఈ చిట్కాలను పాటించండి..!



పొట్ట దగ్గరి కొవ్వు అనేది ప్రస్తుతం చాలా మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. చాలా మంది సన్నగానే ఉంటారు. కానీ పొట్ట దగ్గర కొవ్వు మాత్రం అధికంగా ఉంటుంది. దీనికి అనేక కారణాలు ఉంటాయి. జన్యువుల ప్రభావం, థైరాయిడ్ సమస్య ఉండడం, ఒకే దగ్గర ఎక్కువ సమయం పాటు కూర్చుని చేయకపోవడం, శారీరక శ్రమ చేయకపోవడం, జంక్ ఫుడ్ ను అధికంగా తినడం, మాంసాహారాన్ని అధికంగా తినడం, మద్యం అధికంగా సేవించడం వంటి పలు కారణాల వల్ల చాలా మందికి పొట్ట దగ్గర కొవ్వు పేరుకుపోతుంది. దీన్ని తగ్గించుకునేందుకు నానా తంటాలు పడుతుంటారు. అయితే ఇప్పుడు చెప్పబోయే కొన్ని చిట్కాలను పాటిస్తూ ఆహారంలో మార్పులు చేసుకుంటే పొట్ట దగ్గరి కొవ్వును చాలా సులభంగా కరిగించుకోవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఫైబర్ ఆహారాలు..**

ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను తింటుంటే కొవ్వు సులభంగా కరిగిపోతుంది. ఫైబర్ వల్ల ఆహారాన్ని తక్కువగా తింటారు. కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీంతో ఆహారం తక్కువగా లోపలికి చేరుతుంది. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఫైబర్ ఎక్కువగా ఆకుకూరలు, తాజా పండ్లు, నట్స్, విత్తనాలు, పప్పు దినుసులు వంటి వాటిల్లో లభిస్తుంది. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే పొట్ట దగ్గరి కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. రోజుకు 2 కప్పుల గ్రీన్ టీని చక్కెర లేకుండా తాగాలి. తేనె కూడా అందులో కలపకూడదు. గ్రీన్ టీలో ఈజీసీజీ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది మెటబాలిజంను పెంచుతుంది. క్యాలరీలు త్వరగా ఖర్చయ్యేలా చేస్తుంది. దీంతో కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. గ్రీన్ టీని రోజుకు 2 కప్పులకు మించి తాగకూడదు.

**నట్స్, విత్తనాలు..**

బాదంపప్పులు, వాల్ నట్స్, చియా విత్తనాలు, అవిసె గింజలను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో పాలీ అన్‌శాచురేటెడ్, మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. అందువల్ల ఆయా గింజలు లేదా విత్తనాలను రోజూ నీటిలో నానబెట్టి తింటుంటే ఆకలి నియంత్రణలో ఉంటుంది. అధికంగా ఆహారం తినకుండా చూసుకోవచ్చు. దీంతో పొట్ట దగ్గరి కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. ఓట్స్‌ను రోజు వారి ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. వీటిల్లో ఉండే ఫైబర్ వల్ల పొట్ట దగ్గరి కొవ్వు సులభంగా కరిగిపోతుంది. అలాగే యాపిల్ పండ్లను కూడా రోజూ తినాలి. మొలకలు, క్యారెట్లను ఆహారంలో భాగం చేసుకుంటున్నా కూడా బరువును తగ్గిచుకోవచ్చు. నడుము సన్నగా నాజూగ్గా తయారవుతుంది.

**బ్రౌన్ రైస్..**

మీరు రోజూ తినే తెల్ల అన్నానికి బదులుగా బ్రౌన్ రైస్‌ను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఇది ఫైబర్‌ను అందిస్తుంది. దీని వల్ల కాస్త తిన్నా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం తక్కువగా తింటారు. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అలాగే పసుపు నీళ్లను రోజూ ఒక కప్పు మోతాదులో తాగుతున్నా కూడా ఫలితం ఉంటుంది. పసుపులో ఉండే కర్క్యుమిన్ బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. భోజనానికి ముందు 1 టీస్పూన్ అల్లం రసాన్ని సేవిస్తుండాలి. మిరియాలను ఆహారంలో భాగం చేసుకోవాలి. మిరియాల పొడిని తేనెతో కలిపి రోజుకు 2 పూటలా తింటున్నా ఫలితం ఉంటుంది. ఈ చిట్కాలను పాటించడంతోపాటు ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఒత్తిడి వల్ల కూడా ఆహారం అధికంగా తింటారు. ఇది బరువు పెంచేలా చేస్తుంది. కనుక ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. అలాగే రోజుకు కనీసం 30 నిమిషాల పాటు అయినా వాకింగ్ చేస్తుండాలి. దీని వల్ల పొట్ట దగ్గరి కొవ్వు కరిగిపోతుంది. అధిక బరువు తగ్గుతారు.



# హైడ్రేట్ అవ్వండి..

మనిషి శరీరంలో మూడింట్లో రెండు భాగాలు నీరే ఉంటుంది. ఇది తెలియని విషయం కాకపోయినా,చాలాసార్లు మర్చిపోయి నీళ్లు తాగడం తగ్గిస్తారు. దాంతో శరీరంలో నీటి శాతం తగ్గి రకరకాల సమస్యలు వస్తాయి. ఎండాకాలం అయినా, వానాకాలం అయినా.. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం చాలా అవసరం. హైడ్రేషన్ అంటే శరీరంలో ద్రవాల స్థాయిలను సరిగ్గా ఉంచుకోవడం. హైడ్రేషన్ ఆరోగ్యాన్ని కాపాడితే, డీహైడ్రేషన్ మనిషిని అన్నివిధాలా కుంగదీస్తుంది.

**ఇవీ ప్రయోజనాలు**

- బాడీ హైడ్రేటెడ్‌గా ఉంటే శరీరంలో పోషకాల రవాణా, వ్యర్థాల తొలగింపు, జాయింట్ లూబ్రికేషన్, ఉష్ణోగ్రత నియంత్రణ వంటివి సక్రమంగా జరుగుతాయి.
- హైడ్రేషన్ వల్ల ఆహారం సరిగ్గా జీర్ణమవ్వడంతో పాటు మలబద్ధకం సమస్యే రాదు. గ్యాస్, ఛాతీలో మంట లాంటివి దరి చేరవు.
- శరీరంలో నీటిస్థాయులు తగ్గితే, మెదడు పనితీరులో మార్పులు వస్తాయి. మతిమరుపు, మానసిక ఆందోళ పెరుగుతాయి.
- శరీరంలో నీటి శాతం బాగుంటే, గుండె కొట్టుకునే వేగం నియంత్రణలో ఉంటుంది. అలాగే గుండె నుంచి రక్త ప్రసరణను బాగా జరుగుతుంది.
- హైడ్రేషన్ చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తూ, ఎలర్జీలను దూరం చేస్తుంది.
- నీళ్లు సరిపడా తాగితే, అధిక బరువు సమస్య ఉండదు. బరువు తగ్గాలనుకునే వాళ్లు ఎప్పుడు శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి.
- హాయగా ఉండండి..

**ఎప్పుడు ఏం చేయాలి?**

- రోజు పొడవునా సరిపడా నీళ్లు తాగుతూనే ఉండాలి.
- మూడుపూటలా నీటిశాతం ఎక్కువ ఉండే పండ్లు, కూరగాయాలు తీసుకోవాలి.
- వ్యాయామం చేసినప్పుడు, వేడి వాతావరణంలో ఉన్నప్పుడు శరీరంలో నీటిస్థాయిలు తగ్గిపోతాయి. అలాంటప్పుడు మామూలు కంటే ఎక్కువ నీళ్లు తాగాలి.

**ఎవరు ఎంత తాగాలి?**

- ఒక్కొక్కరికి ఒక్కోలా నీటి అవసరం ఉంటుంది. వాతావరణం, ఆరోగ్యం, శారీరక శ్రమను బట్టి ఒక్కొక్క శరీరాన్ని ఒక్కోలా హైడ్రేట్ చేయాలి. అలాగే స్త్రీ, పురుషుల్లోనూ నీటి అవసరం వేరుగా ఉంటుంది.
- పురుషులు: రోజుకు దాదాపు 3.7 లీటర్ల (పదిహేనున్నర కప్పులు) నీళ్లు తీసుకోవాలి.
- మహిళలు: రోజుకు దాదాపు 2.7 లీటర్ల (పదకొండున్నర కప్పులు) నీళ్లు తాగాలి.


**డీహైడ్రేషన్ లక్షణాలు**

- శరీరంలో నీటి స్థాయులు పడిపోయినప్పుడు వివిధ అనారోగ్య సమస్యలు పలకరిస్తాయి. ఆయా లక్షణాలు గుర్తించి వెంటనే నీళ్లు తాగాల్సి ఉంటుంది.
- దాహం వేయడం
- నోరు, చర్మం తడారిపోవడం
- తలనొప్పి
- కళ్లు తిరగడం
- ఏకాగ్రత లోపించడం
- నోటి దుర్వాసన

**ఇవి పాటించండి**

- ఎక్కడికి వెళ్లినా వెంట ఒక నీళ్ల బాటిల్ పెట్టుకుని, కొన్నికొన్ని తాగుతుండాలి.
- దాహం వేసేవరకు ఆగకుండా అప్పుడప్పుడు నీళ్లు తాగాలి.
- ఉదయం లేవగానే, అలాగే రాత్రి నిద్రపోయే ముందూ మంచినీళ్లు తాగాలి.
- వాతావరణ ఉష్ణోగ్రతలను బట్టి తాగే నీటి శాతాన్ని పెంచుకోవాలి. అలాగని చలికాలంలో నీళ్లు తాగడం తగ్గించొద్దు.
- వ్యాయామం, క్రీడల్లో చురుగ్గా ఉండేవాళ్లు, ఎలక్ట్రోలైట్స్ గల డ్రింక్స్ తాగడం మంచిది.

# బెండకాయతో ఇలా చేస్తే రోగాలన్నీ పరార్..!



ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో.. సరికాని జీవనశైలి కారణంగా అనేక మంది అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. ముందు డబ్బు కోసం పరుగులు తీస్తున్న జనాలు.. ఆ తరువాత అదే డబ్బుతో జబ్బులను తగ్గించుకునేందుకు తంటాలు పడుతున్నారు. అందుకే 'ప్రీవెన్షన్ బెటర్ దెన్ క్యూర్' అని పెద్దలు చెబుతుంటారు. అంటే రోగం వచ్చిన తరువాత తగ్గించుకోవడానికి ఇబ్బంది పడే బదులుగా.. ఆ రోగం రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ఉత్తమం అని అర్థం. ప్రజలు తమ రోజువారి జీవనశైలిలో స్వల్ప మార్పులు చేసుకుంటే చాలు మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు. అనారోగ్యం బారిన పడకుండా అనేక రకాల హెూమ్ రెమిడీస్‌ను వైద్య నిపుణులు చెబుతుంటారు. వాటిలో ఇవాళ మనం ఒక అద్భుతమైన హెల్త్ టిప్ గురించి తెలుసుకుందాం..

**ఓక్రా వాటర్..**

మున్సిపల్ వాటర్ పేరు విన్నాం.. మినరల్ వాటర్ పేరు విన్నాం.. ఈ ఓక్రా వాటర్ ఏంటని ఆలోచిస్తున్నారా.. దాని గురించే ఇప్పుడు తెలుసుకుందాం. ఓక్రా వాటర్ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. రక్తంలో షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తుంది. డయాబెటిస్ రాకుండా కాపాడుతుంది. ఈ నీటిలో అధిక శాతం ఉండే విటమిన్ సి.. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అంతేకాదు.. ఇది వివిధ రకాల ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది. డయాబెటిస్ ఉన్నవారు ప్రతిరోజూ ఒక గ్లాస్ ఓక్రా వాటర్ తాగడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మరి ఈ ఓక్రా వాటర్ ఏంటి..? అసలు దీనిని ఎలా తయారు చేస్తారు..? దీని వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

బెండకాయ ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ విషయం మనందరికీ తెలిసిందే. అయితే, బెండకాయను తినడం కంటే, దానిని రాత్రిపూట నీటిలో నానబెట్టి.. ఉదయం ఆ నీటిని తాగితే మరింత ఆరోగ్య ప్రయోజనం ఉంటుందట. ఈ మధ్య కాలంలో ఈ నీటిని తాగే వారి సంఖ్య కూడా భారీగా పెరుగుతోందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. దీని వలన కలిగే ప్రయోజనాలు ఆ నోటా ఈ నోటా వ్యాప్తి చెందుతుండటంతో.. ప్రజాదరణ భారీగా పెరిగిపోతోంది.

**ఓక్రా వాటర్ ఎలా తయారు చేసుకోవాలి..**

నాలుగు లేదా ఐదు తాజా బెండకాయలను తీసుకొని, బాగా కడిగి, చిన్న ముక్కలుగా కోయాలి. ఆ ముక్కలను ఒక గాజు సీసా లేదా కంటైనర్‌లో వేసి, నీటితో నింపాలి. రాత్రంతా ఫ్రిజ్‌లో పెట్టాలి. ఉదయం బెండకాయ ముక్కలను నీటిలోంచి తీసి ఖాళీ కడుపుతో ఆ నీటిని తాగాలి. ఇలా చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**జీర్ణ సమస్యలను నివారిస్తుంది..**

బెండకాయలో కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీని రసం పేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా.. గ్యాస్, ఆమ్లత్వం, ఉబ్బరం వంటి జీర్ణ సమస్యలను నివారించడానికి కూడా ఇది సహాయపడుతుంది.

**మధుమేహ నియంత్రణ..**

ఓక్రా నీరు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇది డయాబెటిస్ ప్రమాదం నుండి రక్షిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారు ప్రతిరోజూ ఒక గ్లాసు ఈ నీరు తాగడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

**ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ..**

బెండకాయ నీళ్లలో విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ప్రతిరోజూ ఒక గ్లాసు లేడీఫింగర్ వాటర్ తాగడం వల్ల వివిధ ఇన్‌ఫెక్షన్ల నుండి రక్షించుకోవచ్చు.

**బరువు తగ్గడంలో..**

ఓక్రా నీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. త్వరగా బరువు తగ్గాలనుకునే వారు ప్రతిరోజూ ఒక గ్లాసు ఓక్రా నీరు త్రాగాలి.

**చర్మం ఆరోగ్యానికి..**

బెండకాయ నీటిలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటాయి. ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. ఇది చర్మం అందంగా కనిపించడానికి సహాయపడుతుంది.

**ఆర్థరైటిస్ నుండి ఉపశమనం..**

ఓక్రా నీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కీళ్లలో వాపును తగ్గిస్తుంది. ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆర్థరైటిస్ నుండి రక్షిస్తుంది.

**చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది..**

బెండకాయలో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను కరిగించడంలో సహాయపడతాయి. ఇది గుండెకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. తద్వారా గుండె సంబంధిత సమస్యల నుండి రక్షిస్తుంది.

**క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తుంది..**

ఓక్రా నీటిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. తద్వారా క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది.

# తలనొప్పిగా మారిన భారత జట్టు ఎంపిక

## ఒక్కో ప్లేస్‌కు నలుగురు ఆటగాళ్లు పోటీ







ఆసియా కప్ 2025 నేపథ్యంలో భారత జట్టు ఎంపిక పెద్ద తలనొప్పిగా మారింది. సీనియర్ ఆటగాళ్లు, ఐపీఎల్ స్టార్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఎవర్ని ఎంపిక చేయాలి? మరెవర్ని పక్కనపెట్టాలనే విషయాన్ని అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ తేల్చుకోలేకపోతుంది. ఒక్కో ప్లేస్‌కు ముగ్గురు నుంచి నలుగురు ఆటగాళ్లు పోటీ పడుతున్నారు.ఇంగ్లండ్ పర్యటనలో కెప్టెన్‌గా బ్యాటర్‌గా దుమ్మురేపిన శుభ్‌మన్ గిల్.. గతేడాదిగా టీమిండియా టీ20 జట్టులో లేడు. ఐపీఎల్ 2025 సీజన్‌తో పాటు ఇంగ్లండ్ గడ్డపై మెరుగైన ప్రదర్శనతో శుభ్‌మన్ గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. అతన్ని తీసుకోవాలా? లేదా? అనే విషయంపై అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ మల్లగుల్లాలు పడుతోంది. అతనితో పాటు యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్‌ల విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.మంగళవారం ముంబై వేదికగా ఆసియా కప్ బరిలోకి దిగే భారత జట్టును సెలెక్షన్ కమిటీ ప్రకటించే అవకాశం ఉంది. 15 మంది ఆటగాళ్లను మాత్రమే ఎంపిక చేయాల్సి ఉంది. అయితే తాజా సమాచారం ప్రకారం 15వ ఆటగాడి ప్లేస్ కోసం శ్రేయస్ అయ్యర్, రింకూ సింగ్, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్ మధ్య తీవ్ర పోటీ ఉన్నట్లు తెలుస్తోంది.ఐపీఎల్ 2025 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ మెరుగైన ప్రదర్శన చేశాడు. కెప్టెన్‌గా బ్యాటర్‌గా సత్తా చాటి 11 ఏళ్ల తర్వాత పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు. దాంతో అయ్యర్‌ను తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. అంతేకాకుండా పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో ఒత్తిడిని తట్టుకోవాలంటే అనుభవం కలిగిన ఆటగాళ్లు జట్టులో ఉండాలనే వాదన కూడా వినిపిస్తోంది. మరోవైపు రింకూ సింగ్ ఫినిషర్‌గా జట్టులో కొనసాగుతున్నాడు.చివర్లో తక్కువ బంతుల్లో ఎక్కువ పరుగులు చేయడం అతని స్పెషాలిటీ. కానీ ఐపీఎల్ 2025 సీజన్‌తో పాటు అతను ఆడిన చివరి అంతర్జాతీయ టీ20ల్లో తీవ్రంగా నిరాశపర్చాడు. రియాన్ పరాగ్ బ్యాటింగ్ ఆల్‌రౌండర్‌గా జట్టుకు అడ్వాంటేజ్‌గా మారనున్నాడు. ఇప్పటికే భారత్ తరఫున అతను సత్తా చాటాడు. వాషింగ్టన్ సుందర్ గురించి కూడా ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇటీవల ఇంగ్లండ్ పర్యటనలో అతను అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. మరీ సెలెక్టర్లు ఎవర్ని ఎంపిక చేస్తారో చూడాలి.

# టీంకు కోచ్ మంచి గైడెన్స్ ఇచ్చాడు

## ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ వెల్లడి




గత సంవత్సరం జులైలో టీమ్ ఇండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ సెలక్ట్ అయ్యాడు. అప్పటి నుంచి టెస్ట్ క్రికెట్‌లో భారత్ పెద్దగా విజయాలు సాధించలేదు. టీమ్ సెలక్షన్, స్ట్రాటజీల విషయంలో గంభీర్ ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నాడు. నాలుగు టెస్ట్ సిరీస్‌లలో ఒకే ఒక్క గెలుపు దక్కింది. స్పెషలిస్ట్ ప్లేయర్స్ కంటే ఆల్ రౌండర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం, కీలక బౌలర్లపైనే అతిగా ఆధారపడటం వంటి నిర్ణయాలతో విమర్శలు ఎదుర్కొన్నాడు.

ఈ ఛాలెంజెస్ ఉన్నప్పటికీ గంభీర్ మ్యాన్ మేనేజ్‌మెంట్‌లో మాత్రం హైలెట్ అయ్యాడు. యంగ్ ప్లేయర్లను ఇన్‌స్పైర్ చెయ్యడంలో, వారిలోని బెస్ట్‌ని బయటకు తీసుకురావడంలో సక్సెస్ అయ్యాడు. టాప్, సీనియర్ ప్లేయర్లు రోహిత్, కోహ్లీ రిటైర్ అయ్యాక యంగ్ టీమ్ ఇండియాకి కోచ్ మంచి గైడెన్స్ ఇచ్చాడని ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్‌లేటెస్ట్ ఇంటర్వ్యూలో చెప్పాడు.ప్రస్తుతం ఇండియా టీమ్ ట్రాన్సిషన్ ఫేజ్‌లో ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ప్లేయర్లు రిటైర్మెంట్ ఇచ్చేశారు. మహ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రా వంటి కీలక బౌలర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం లేదు. ఇప్పుడున్న టీమ్‌కి మరీ ఎక్కువ ఎక్స్‌పీరియన్స్ లేదు. కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ మాత్రమే ఎక్స్‌పీరియన్స్‌డ్ బ్యాట్స్‌మెన్‌గా ఉన్నారు. బుమ్రా, సిరాజ్ బౌలింగ్ డిపార్ట్‌మెంట్‌ను లీడ్ చేస్తున్నారు. చాలామంది ప్లేయర్లు అరంగేట్రం లేదా లాంగ్ గ్యాప్ తర్వాత తిరిగి వచ్చినవారే. టీమ్ టఫ్ స్పాట్‌లో ఉంది. ఇలాంటి టైమ్‌లో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ యంగ్ టీమ్‌ను సక్సెస్‌ఫుల్‌గా నడిపిస్తున్నాడని ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ 'రెవ్‌స్పోర్ట్జ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు. గంభీర్ స్ట్రెంత్ ప్లేయర్స్‌ని మోటివేట్ చేయడంలో ఉందని, అతడు టీమ్ ఇండియాకి ప్రాతినిధ్యం వహించడం గౌరవమని శార్దూల్ చెప్పాడు. యంగ్‌స్టర్స్ టాలెంట్‌పై నమ్మకం ఉంచాడని, టీమ్ మీటింగ్స్‌లో గంభీర్ చెప్పిన మాటలను శార్దూల్ గుర్తుచేసుకున్నాడు. 'దేశానికి ఆడటం మీ అదృష్టం. మీకు నమ్మకం ఉంటే, మీరు ఓడించలేని ప్రత్యర్థి లేదు. ఇది మీ రోజు అయితే, మీరు ఎంతగా కోరుకుంటే, అంతగా విజయం సాధిస్తారు.' అని గంభీర్ చెప్పాడని వివరించాడు.హెడ్ కోచ్ మోటివేషన్‌తో, ఈ మైండ్‌సెట్ ప్లేయర్స్‌లో కనిపించింది. వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, ఆకాష్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి యంగ్ ప్లేయర్స్ గంభీర్ గైడెన్స్‌లో డెవలప్ అయ్యారు. ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో ఇబ్బంది పడిన శార్దూల్ కూడా గంభీర్ తన కాన్ఫిడెన్స్‌ని బూస్ట్ చేశాడని చెప్పాడు. యంగ్ ప్లేయర్స్‌లోని ఎనర్జీని యూజ్ చేసుకోవడం గంభీర్ విధానం. మోడర్న్ క్రికెట్‌లో, కోచ్ పాత్ర టెక్నికల్ ఛేంజెస్ కంటే, నమ్మకాన్ని పెంపొందించడంలోనే ఎక్కువగా ఉంటుందని గంభీర్ అర్థం చేసుకున్నాడు. తమను తాము నిరూపించుకోవడానికి ఆసక్తిగా ఉన్న యంగ్ ప్లేయర్స్‌కి గైడెన్స్ ఇచ్చాడు. 'యంగ్ ప్లేయర్స్ జట్టులో ఉన్నప్పుడు, వారు ప్రపంచం ముందు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఏదైనా చేస్తారు. అదే టీమ్ ధైర్యాన్ని పెంచింది. మా జట్టును ముందుకు నడిపించింది' అని శార్దూల్ వివరించాడు.

# మా నాన్నకి క్రికెట్ అంటే అపారమైన ఇష్టం

## శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలు



అన్ని ఫార్మాట్లకూ సరిపోయే ఆటతీరుతో, సవాళ్లను దాటే ధైర్యంతో, అలరించే షాట్లతో 'విరాట్ తర్వాత ఎవరు?' అనే ప్రశ్నకు తానే సమాధానం చెబుతున్నాడు ఈ పంజాబీ యువ సంచలనం శుభ్?మన్ గిల్. తాజాగా ఇంగ్లాండ్‌పై జరిగిన టెస్టు సిరీస్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో పాటు కెప్టెన్‌గా కూడా అదరగొట్టాడు. తన ప్రయాణం, తన కలల గురించి చెప్పుకున్న ముచ్చట్లు ఇవే.'మా నాన్నకి క్రికెట్ అంటే అపారమైన ఇష్టం. నిజానికి ఆయనకే క్రికెటర్ కావాలనేది కల. కానీ కుటుంబ పరిస్థితుల కారణంగా సాధ్యం కాలేదు. ఆ కలను నా ద్వారా నెరవేర్చుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఒకసారి మ్యాచ్ చూసేందుకు నేను నాన్నతో కలిసి మొహాలీ వెళ్లాను. అక్కడి స్టేడియం వాతావరణం చూసిన తర్వాత, 'నా బిడ్డ ఇక్కడే క్రికెట్ నేర్చుకోవాలి' అని అనుకున్నారు నాన్న. ఆ తర్వాత మేమంతా మొహాలీకి మారిపోయాం 'చదువుకుంటూనే మొహాలీ క్రికెట్ అసోసియేషన్ అకాడమీలో చేరాను. ప్రతి రోజు ఉదయం నాలుగు గంటలకు లేచి అకాడమీకి వెళ్లేవాడిని. రెండు గంటల ప్రాక్టీస్ చేసి స్కూల్‌కి వెళ్ళేవాడిని. స్కూల్ నుంచి వచ్చాక మధ్యాహ్నం నాన్న పర్యవేక్షణలో ఒక గంట సాయంత్రం మళ్లీ మూడు గంటలు అకాడమీలో కఠినమైన ప్రాక్టీస్ చేసేవాడిని. అదే నా ఆటతీరుకు పునాది''నా ఆట ఎప్పుడూ నాకంటే పెద్దవాళ్లతోనే ప్రారంభమైంది. పదకొండేళ్లకే అండర్-16 జట్టులోకి పదహారేళ్లకే అండర్-19 జట్టులోకి ఎంపికయ్యా. ఈ ప్రయాణం నాకు కొత్త సవాళ్లు విసిరింది అదే నన్ను మెంటల్‌గా, టెక్నికల్‌గా తీర్చిదిద్దింది''2018లో జరిగిన అండర్%-%19 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచాను. అదే నా కెరీర్‌కి టర్నింగ్ పాయింట్. అప్పుడే ఐపీఎల్ వేలం జరగ్గా కోల్‌కతా జట్టు నన్ను రూ.1.8 కోట్లకు కొనుగోలు చేసింది' 'ఆ తర్వాత 2019లో భారత్ వన్డే జట్టులోకి ఎంపికయ్యా. 2020 చివర్లో టెస్టుల్లో కూడా నా డెబ్యూ జరిగింది. అలా ఒక్కో మెట్టుగా నా క్రికెట్ ప్రయాణం ముందుకు సాగింది' 'గెలుపులో మాకంటే ఎక్కువ సంతోషపడేది. ఓటమిలో మాకంటే ఎక్కువ బాధపడేది మా అమ్మే. ఆమె రియాక్షన్ చూసి నాకు ఆటలో మోటివేషన్ రెట్టింపవుతుంది. ఇక మా అక్క సంగతి వేరే. ఆమె నా బెస్ట్ ఫ్రెండ్. నా సీక్రెట్స్ అన్నీ ఆమెకే తెలుసు. 'సాధారణంగా ఆటగాళ్లంతా సింగిల్ డిజిట్ జెర్సీ నంబర్స్ కోరుకుంటారు. కానీ నాకు మాత్రం డబుల్ డిజిట్ 77 వచ్చింది. అండర్%-%19 వరల్డ్‌కప్‌లో నేను నంబర్ 7 జెర్సీ కావాలని అడిగాను. అప్పటికే ఆ నంబర్ వేరొకరికి ఇచ్చేశారు. అప్పుడు నేను 77 ఎంచుకున్నాను. రెండు సెవెన్స్ (77) అది కూడా నా లక్కీ నెంబర్ అయిపోయింది' 'ఇంట్లో వాళ్లు నన్ను 'కాకా' అని పిలుస్తారు. (పంజాబీలో దానికి 'బేబీ' అని అర్థం. మన తెలుగులో బుజ్జీ, చిన్నీ అన్నట్టే). అభిమానులకైతే నేను 'ప్రిన్స్'. 'నా బెస్ట్ ఫ్రెండ్ ఇషాన్ కిషన్. ఫుడ్‌లో నాకు సుషీ, ఆలూ పరాఠా చాలా ఇష్టం''చిన్నప్పుడు నాకు బ్యాట్, బాల్ తప్ప వేరే బొమ్మలు కావలసిన అవసరమే ఉండేది కాదు. అవే నా తోడు. నిద్రపోయేటప్పుడుకూడా వాటిని నా పక్కన పెట్టుకునేవాడిని. నా ఆ క్రేజ్ చూసిన నాన్న మా పొలంలోనే ఒక చిన్న గ్రౌండ్ సిద్ధం చేశారు. ఊరిలోని పిల్లల్ని పిలిచి, నన్ను ఔట్ చేస్తే రూ.100 ఇస్తానని చెప్పేవారు. అప్పట్లో డబ్బులు పోకూడదనే ఉత్సాహంతో వికెట్ కాపాడుకునే నైపుణ్యం నేర్చుకున్నాను. అదే నన్ను ఇక్కడిదాకా తీసుకొచ్చింది. అందుకే నాన్నే నా తొలి గురువు అని ఎప్పుడూ చెప్పుకుంటుంటా. ఇప్పటికీ మ్యాచ్ అయిపోయాక ముందుగా ఫోన్ చేసే వ్యక్తి మా నాన్నే'నాకు మొదటి నుంచీ అందరినీ కలుపుకొని పోయే స్వభావం ఉంది. అదే నాకు టీమ్‌లో ఒక బలం. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు రెండు సీజన్ల పాటు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం ఇప్పుడు నాకు చాలా ఉపయోగపడుతోంది. కానీ, బీసీసీఐ నా పేరును టెస్టు కెప్టెన్‌గా ప్రకటించగానే 'విదేశాల్లో ఏ రికార్డు లేకుండా ఎలా ఎంపిక చేశారు?' అంటూ చాలా విమర్శలు వచ్చాయి. అయితే సారథిగా నా తొలి టెస్టులోనే మెరుగైన ప్రదర్శన ఇవ్వగానే అందరికీ నా సామర్థ్యంపై నమ్మకం పెరిగింది. ఇక దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ %-% వాళ్లిద్దరి నైపుణ్యాలు నాలో ఉన్నాయని చెబుతుండటం నాకు మరింత బలాన్నిచ్చింది. అది నాకు మోటివేషన్ కూడా అయిందని అన్నారు.

# ఆసియా కప్‌లో భారత్‌ను ఓడిస్తాం

## పీసీబీ చీఫ్ సెలెక్టర్ ఆకిబ్ జావేద్




పాకిస్తాన్ క్రికెట్ బోర్డు 2025 ఆసియా కప్ కోసం 17 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఈ సందర్భంగా కొన్ని గట్టి నిర్ణయాలు తీసుకుంది. జట్టు ఎంపికలో ఆశ్చర్యకరంగా బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్, నసీమ్ షా వంటి ప్రముఖ ఆటగాళ్లను సెలెక్టర్లు పక్కన పెట్టారు. పీసీబీ చీఫ్ సెలెక్టర్ ఆకిబ్ జావేద్ ఈ జట్టు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని భారత జట్టును ఓడించే సామర్థ్యం కలిగి ఉందని ధీమాగా ఉన్నారు. ఇటీవలి పేలవమైన ప్రదర్శనలు ఉన్నప్పటికీ, ఈ జట్టు ఆసియా కప్‌లో భారత్‌ను ఓడించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. "భారత్‌తో మ్యాచ్‌లు ఎప్పుడూ ఉత్కంఠభరితంగా ఉంటాయి. ఈ 17 మంది సభ్యుల జట్టు ఏ జట్టునైనా ఓడించే సత్తా కలిగి ఉంది. మనం వారిపై ఒత్తిడి చేయకూడదు, కానీ నాకు ఈ జట్టు మీద పూర్తి నమ్మకం ఉంది," అని జావేద్ అన్నారు. యువ ఆటగాళ్లపై నమ్మకం ఉంచి, బాబర్ ఆజం వంటి సీనియర్ ఆటగాళ్లను తప్పించింది. పాకిస్తాన్ సూపర్ లీగ్ ఆటగాళ్ల ఎంపికలో కీలక పాత్ర పోషించిందని జావేద్ తెలిపారు. "మేము సీనియర్ ఆటగాళ్లను పూర్తిగా విస్మరించడం లేదు. ప్రస్తుత ఎంపిక ఆటగాళ్ల అభివృద్ధిని బట్టి జరిగింది. సాహిబ్‌జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, మరియు ఫఖర్ జమాన్‌లను ఉదాహరణలుగా చెప్పవచ్చు. సాహిబ్‌జాదా తిరిగి రాగలిగాడు, సైమ్ కూడా ప్రారంభంలో ఇబ్బంది పడినా తర్వాత రాణించాడు," అని జావేద్ వివరించారు. ఆయన మరింత మాట్లాడుతూ, "ఆటగాడి కెరీర్‌ను ఒక్కసారిగా ముగించలేం. అవకాశాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ప్రస్తుతం కొందరు ఆటగాళ్లు , బిగ్ బాష్ లీగ్ వంటి టోర్నమెంట్లలో అనుభవం సంపాదిస్తున్నారు. ఎవరు మెరుగైన ప్రదర్శన చేస్తారో, వారే జట్టులో చోటు దక్కించుకుంటారు," అని జావేద్ స్పష్టం చేశారు. బాబర్ ఆజం జట్టులో చేరని విషయంపై మాట్లాడుతూ, జావేద్ ఇలా అన్నారు: "బాబర్ స్పిన్‌ను ఎదుర్కోవడంలో మరియు స్ట్రైక్ రేట్‌లో కొన్ని అంశాల్లో మెరుగుపడాలని మేము సూచించాము. అతను దానిపై కఠినంగా పని చేస్తున్నాడు. బాబర్ వంటి ఆటగాడు బిగ్ బాష్ లీగ్‌లో ఆడి, టీ20 ఫార్మాట్‌లో మెరుగైన ప్రదర్శన చేయగలడని నమ్ముతున్నాము. అతను అద్భుతమైన ఆటగాడు, అతన్ని విస్మరించడం అసాధ్యం." అని జావెద్ పేర్కొన్నాడు.

**పాకిస్తాన్ క్రికెట్ జట్టు :** సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్ , ఫహీమ్ అష్రఫ్, ఫకర్ జమాన్, హారీస్ రౌఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ తలత్, ఖుష్దిల్ షా, మహ్మద్ హారీస్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీమ్ జూనియర్, సాహిబ్‌జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షాహీన్ షా అఫ్రిది, సుఫ్యాన్ మోకిమ్




# రావు బహద్దూర్ టీజర్

టాలెంటెడ్ యాక్టర్ సత్యదేవ్ ఎన్నో సినిమాలలో వైవిధ్యమైన పాత్రలు పోషించి మెప్పించారు.. బ్లఫ్ మాస్టర్ సినిమా తర్వాత ఆయన నటనకు చాలామంది ఫిదా అయ్యారు. ఇటీవల జీబ్రా చిత్రంతో ఆకట్టుకున్న సత్యదేవ్ ఇప్పుడు రావు బహదూర్ అనే చిత్రంతో మరింత వినోదం పంచబోతున్నాడు. ఆయన నుంచి ఇంకా ఎక్కువ ఆశిస్తున్న వారికి ఈ మూవీ సమాధానం చెప్పేల కనిపిస్తుంది. 'రావు బహదూర్' అనే -టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో సత్యదేవ్ పూర్తిగా భిన్నమైన లుక్‌లో కనిపించాడు. ఇటీవల విడుదలైన పోస్టర్‌ని చూసి ఇది ఫాంటసీ డ్రామా కానుందా? అనే ఆసక్తి కలుగుతుంది. ఈ చిత్రాన్ని కేరాఫ్ కంచరపాలెం దర్శకుడు వెంకటేష్ మహా తెరకెక్కిస్తున్నారు.'అనుమానం పెనుభూతం' అనే లైన్‌ను హైలైట్ చేస్తున్న నేపథ్యంలో ఇందులో ఊహించని ట్విస్ట్‌లు ఉంటాయని అర్థమవుతుంది.తాజాగా మూవీ టీజర్ రాజమౌళి చేతుల మీదుగా విడుదల చేశారు. టీజర్.. నాకు అనుమానం అనే భూతం పట్టిందనే ఆసక్తికర డైలాగ్‌తో ప్రారంభమైంది. సన్నివేశాలు ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. సైకలాజికల్ డ్రామాగా దీనిని తీర్చి దిద్దినట్టు- టీ-జర్ చూస్తుంటే తెలుస్తుంది. వచ్చే సమ్మర్‌కి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ చిత్రం ద్వారా సత్యదేవ్ నుంచి ప్రేక్షకులు కోరుకునే కొత్తదనం మళ్ళీ ఆయనలో చూడబోతున్నామని, మహేశ్వర ఉగ్రరూపస్య తరహా ఇంపాక్ట్‌ను వెంకటేష్ మహా మళ్ళీ అందించబోతున్నాడని అనిపిస్తోంది. ఈ చిత్రాన్ని శ్రీచక్ర ఎంటర్‌టైన్మెంట్స్, ఏ ప్లస్ ఎస్ సినిమాస్ నిర్మిస్తుండగా, సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పిస్తున్నారు. 'రావు బహదూర్' అనేది ఓ రాజవంశం నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ డ్రామా. దీనికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, ఎడిటింగ్ వెంకటేష్ మహానే చేశారు. స్మరణ్ సాయి సంగీతం సమకూరుస్తుండగా.. కార్తీక్ పర్మార్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రోహన్ సింగ్ ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేస్తున్న ఈ చిత్రానికి దినేష్ యాదవ్ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# కన్నడ భామ ఖాతాలో మరో క్రేజీ ప్రాజెక్టు

బీర్బల్ మూవీతో కెరీర్ ను స్టార్ట్ చేసిన రుక్మిణి వసంత్, సప్త సాగరాలు దాటి సైడ్ ఎ, సైడ్ బి సినిమాలతో విపరీతమైన క్రేజ్ ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం కన్నడ, తమిళ, తెలుగు భాషల్లో నటిస్తూ భారీ డిమాండ్ ఉన్న టాలెంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా రుక్మిణి ఎదిగారు. విజయ్ సేతుపతి సరసన ఏస్ సినిమాలో నటించి కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన రుక్మిణి రీసెంట్ గానే కాంతార చాప్టర్1 షూటింగ్ లో జాయిన్ అయ్యారు. కాంతార1 తో పాటూ శివ కార్తికేయన్ తో కలిసి రుక్మిణి ఓ సినిమా చేస్తున్నారు. అది కాకుండా మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా రుక్మిణి హీరోయిన్ గా నటించనున్నారు. అయితే ఇప్పుడు మరో భారీ ప్రాజెక్టులో రుక్మిణి చోటు దక్కించుకుందనే విషయం ఆమెను మరోసారి వార్తల్లో నిలిపింది. అదే యష్ హీరోగా వస్తోన్న టాక్సిక్. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాల తర్వాత యష్ చేస్తున్న సినిమానే టాక్సిక్. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. టాక్సిక్ కోసం ఇప్పటికే పలు భాషల నుంచి స్టార్లను తీసుకోగా ఇప్పుడు కన్నడ ఇండస్ట్రీ నుంచి రుక్మిణి కూడా తోడైనట్టు తెలుస్తోంది. కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా లాంటి భారీ తారాగణంతో పాటూ రుక్మిణి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. టాక్సిక్ లో రుక్మిణి నటిస్తుందనే విషయాన్ని మేకర్స్ ఇంకా అధికారికంగా అనౌన్స్ చేయకపోయినప్పటికీ ఇప్పటికే ఈ సినిమా కోసం రుక్మిణి పలు షెడ్యూళ్ల షూటింగ్ ను కూడా పూర్తి చేశారని శాండిల్‌వుడ్ వర్గాల నుంచి లీకులందుతున్నాయి. ఇంగ్లీష్, కన్నడ భాషల్లో సమాంతరంగా తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమా వచ్చే ఏడాది మార్చి 19న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# దివంగత కోట శ్రీనివాసరావు ఇంట మరో విషాదం...

## ఆయన సతీమణి రుక్మిణి తుది శ్వాస విడిచారు...



దివంగత నటుడు కోట శ్రీనివాసరావు ఇంట విషాదం నెలకొంది. ఆయన భార్య రుక్మిణి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం ఆగస్టు 18న తుదిశ్వాస విడిచారు.

కాగా కోట శ్రీనివాసరావు నెల రోజుల క్రితమే పరమపదించారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో జూలై 13న కన్నుమూశారు. ఆయన మరణించిన నెల రోజులకే భార్య మరణించడం విషాదకరం! కోట రుక్మిణి మృతిపై పలువురు సెలబ్రిటీలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

విలక్షణ నటుడు తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా కోట శ్రీనివాసరావు తనదైన ముద్ర వేశారు. విలన్‌గా, తండ్రిగా, కామెడీ విలన్‌గా, రాజకీయ నాయకుడిగా విభిన్న పాత్రలో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. 1978లో ప్రాణం ఖరీదు సినిమాతో రంగప్రవేశం చేసిన కోట.. అన్నిరకాల పాత్రలు పోషించి తెలుగు తెరపై ఆల్‌రౌండర్‌గా నిలిచారు.

# విడుదలకు సిద్ధంగా అనుష్క ఘాటి




టాలీవుడ్ బ్యూటీ అనుష్కా శెట్టి నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఘాటి క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. కాగా మేకర్స్ మ్యూజికల్ అప్‌డేట్ అందించారు. ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. దస్సోరా సాంగ్‌ను ఆగస్టు 20న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు- కొత్త లుక్ విడుదల చేశారు. విక్రమ్ ప్రభు, అనుష్క తమ భుజాలపై భారీ మూటలు మోస్తూ కొండలపై నుంచి వస్తున్న లుక్ పాటపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ పాటను నాగవెల్లి విద్యాసాగర్ కంపోజ్ చేశాడు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్-టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో చైతన్య రావ్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏప్రిల్‌లోనే విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడుతూ వస్తోన్న నేపథ్యంలో నిరాశ చెందుతున్న అభిమానులు, ఫాలోవర్లు ప్రమోషన్స్‌ను వేగవంతం చేయాలని అనుష్క టీంకు రిక్వెస్ట్‌లు పెడుతున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి

విడుదల చేసిన జనాలంతా కొండ ప్రాంతం మధ్యలోని దారి వెంట మూటలు మోసుకొని వెళ్తున్న లుక్‌తోపాటు- గ్లింప్స్ సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఘాటి అమెజాన్ ప్రైమ్ వీడియోలో పోస్ట్ థియాట్రికల్ రిలీజ్ కానుంది.

# ఇంటివాడు కాబోతున్న గాయకుడు సిప్లిగంజ్

## ప్రేమికురాలు హరిణిరెడ్డితో నిశ్చితార్థం



బిగ్ బాస్ సీజన్ 3 విజేత, 'నాటు- నాటు-' పాటతో ఆస్కార్ వేదికపై తెలుగు పాటను నిలబెట్టిన గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రేమికురాలు హరిణి రెడ్డితో ఇటీవల నిశ్చితార్థం జరుపుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఎప్పుడూ తన వ్యక్తిగత విషయాలను అభిమానులతో పంచుకుంటూ కనిపించే రాహుల్ ఈసారి మాత్రం తన నిశ్చితార్థ వేడుకను చాలా ప్రైవేట్‌గా ఉంచారు. ఎటువంటి అధికారిక ప్రకటన చేయకపోయిన, వారికి సంబంధించిన ఒక ఫొటో సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో ఇది వెలుగులోకి వచ్చింది.ఫొటోలో రాహుల్, హరిణి రెడ్డి కలర్ ఫుల్ డ్రెస్సుల్లో మెరిసిపోయారు. రాహుల్ పాస్టెల్ లావెండర్ షేర్వానీలో రాయల్ లుక్‌లో కనిపించగా, హరిణి ఆరెంజ్ కలర్ లెహంగాను ధరించి తళుక్కుమంది. ఈ జంటని చూసిన వారంతా కూడా చూడముచ్చటగా ఉందంటు-న్నారు. మరి పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు అనే దానిపై క్లారిటీ- రావలసి ఉంది. హరిణి రెడ్డి గురించి ఇంకా పూర్తి సమాచారం లేనప్పటికీ, ఆమె కూడా టాలీవుడ్ ఇండస్ట్రీక్రి సంబంధించిన వ్యక్తిగానే భావిస్తున్నారు. యాంకర్ విష్ణుప్రియ, సింగర్ నోయల్, స్రవంతి చొక్కారపు, గీతా మాధురి, అరియానా, సన్నీ, జబర్దస్త్ రోహిణి, కరుణ భూషణ్ వంటి పలువురు ఇండస్ట్రీ ప్రముఖులు ఆమెను ఫాలో అవుతున్నారు. ఈ శుభవార్త బయటకు వచ్చాక, రాహుల్ అభిమానులు సోషల్ మీడియాలో కంగ్రాట్స్ చెబుతున్నారు. గతంలో రాహుల్ సిప్లిగంజ్.. అషూ రెడ్డితో ప్రేమలో ఉన్నారని జోరుగా ప్రచారం సాగింది. ఇప్పుడు వాటన్నింటికి ఫులిస్టాప్ పడింది. ఇక రాహుల్ ప్రస్తుతం సింగర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. 'మరిపాలే', 'బోనాలే', 'పెదవలే పడితేనా', 'ఊహలు గుసగుసలాడే', 'నాటు- నాటు-' వంటి ఎన్నో హిట్ సాంగ్స్‌తో యువతను అలరిస్తూ వస్తున్నాడు. పర్సనల్ లైఫ్‌లో కూడా గుడ్ న్యూస్ చెప్పి ఫ్యాన్స్‌ని ఖుషీ చేశాడు.

# కొదమసింహాలో ఆ ఏమోషన్ లేదు

## ఆనాటి చిరు సినిమాపై రాజమౌళి అభిప్రాయం

ప్రస్తుతం రాజమౌళి మహేశ్‌బాబుతో మూవీ చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యాక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. నవంబరులో ఇందుకు సంబంధించిన లుక్‌ను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. సన్నివేశాలను భావోద్వేగంగా మలిచి ప్రేక్షకుడి మదిలో చెరగని ముద్ర వేయడంలో సిద్ధహస్తులు దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి అందుకే ఆయన తీసే సినిమాలు ప్రేక్షకులను అలరించడమే కాదు, బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపిస్తాయి. ఇక ఎమోషనల్ సన్నివేశాలు, హీరో ఎలివేషన్ సీన్స్ తీయడంలో ఆయనది ప్రత్యేకమైన శైలి. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'మగధీర' రామ్‌చరణ్ కెరీర్‌లో భారీ విజయాన్ని అందుకుంది. అందులోని ఓ సన్నివేశం భావోద్వేగభరితంగా రావడానికి చిరంజీవి నటించిన 'కొదమ సింహం'చిత్రమే కారణమని రాజమౌళి ఓ సందర్భంలో పంచుకున్నారు. అప్పట్లో థియేటర్‌లో 'కొదమసింహం' సినిమా చూస్తున్నా. అందులో రౌడీలు చిరును పీకల్లోతు ఇసుకలో పాతిపెట్టి వెళ్లిపోతారు. అక్కడే ఉన్న ఆయన గుర్రం ఆయన నోటికి తాడు అందించి కాపాడుతుంది. ఆ సీన్ చూసి తీవ్ర భావోద్వేగానికి గురయ్యా. అయితే, ఆ కష్టంలో నుంచి బయటకు వచ్చిన ఆయనకు, గుర్రానికీ అనుబంధం లేదనిపించింది. సాయం చేసిన ఒక వ్యక్తికి థ్యాంక్స్ చెప్పకపోతే ఆ భావోద్వేగం ఎలా సంపూర్ణమవు తుందనిపించింది. అది నా మైండ్‌లో అలాగే ఉండిపోయింది. ఒక ప్రేక్షకుడిగా అప్పుడు నా ఎమోషన్ తృప్తి చెందలేదు. అందుకే 'మగధీర'లో ఇసుక ఊబిలో కూరుపోయిన చరణ్ బయటకు వచ్చిన తర్వాత తన గుర్రాన్ని కౌగలించుకుంటాడు. ఒక స్నేహితుడిలా చూస్తూ దానితో కృతజ్ఞత భావంతో మాట్లాడతాడు. అలా నా సినిమాల్లో బలమైన సన్నివేశాలు ప్రేక్షకుల ఆలోచనల నుంచి స్ఫూర్తి పొంది రాసినవే ఉంటాయని రాజమౌళి చెప్పుకొచ్చారు.




Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463